VISALAANDHRA VIJAYAWADA Phone No 376

15.4.59

7002ks

విశాలాంధ్ర

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టరు నెం 193

సంపుటి 8] విజయవాడ • ఏప్రిల్ 15 1959 • బుధవారం [సంచిక 6

టిబెట్ పరిస్థితిపై మాస్కో రేడియో ప్రకటన

లండన్, ఏప్రిల్ 14

టిబెట్‌లో పరిస్థితులు కుదుటపడుతున్నవి కాని, తిరుగుబాటుదార్లు కొందరు ప్రాయుధులై దేశంలో తిరుగుతూనే ఉన్నారని మాస్కో రేడియో నేడు ప్రకటించింది

దేశభక్తులపైన, ప్రజలపైన వీరు దారుణ హింసాకాండ సాగిస్తున్నారనీ, కానీ, వీరిని తుదముట్టించడం తథ్యమనీ మాస్కో రేడియో ప్రకటించింది

సిమెంటు కార్మికులకు తాత్కాలిక సహాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

సిమెంటు వేతనాలబోర్డు, సిమెంటు పరిశ్రమలోని కార్మికులకు తాత్కాలిక సహాయంచేసే సమస్యను త్వరలో చర్చించనున్నదని కేంద్ర కార్మిక ఉపమంత్రి శ్రీ అబిదాలీ నేడు లోక్‌సభలో ప్రకటించారు

పాకిస్తానీయుల దాడులపై పార్లమెంటు సభ్యుల ఆందోళన

తిరుగుబాటుదార్లను ఖండిస్తూ టిబెట్టులో పెద్ద ఎత్తున సభలు

లాసా, ఏప్రిల్ 7

టిబెట్టులోని పై వర్గాలకు చెందిన అభివృద్ధి నిరోధకులు చేసిన తిరుగుబాటును ఖండిస్తూ టిబెట్టు దేశం నలుమూలలా ప్రజలు సభలు జరుపుతున్నారు.

దేశానికి ద్రోహంచేసి, ప్రజలపై ఘోరమైన అత్యాచారాలు చేసిన ఈ తిరుగుబాటుదారుల చర్యలను ఈ సభలలో పాల్గొంటున్న బౌద్ధభిక్షువులు, సామాన్యప్రజలు నిశితంగా విమర్శిస్తూ ప్రసంగించారు.

జిక్ స్టేలో జరిగిన ఒక సభలో 2 వేలమంది ప్రజలు పాల్గొన్నారు. టిబెటన్ విద్రోహుల రాక్షస కృత్యాలను ఈసభ ఏకగ్రీవంగా ఖండించింది.

పినామంటే అను ఒక టిబెట్ కార్మికుడు సభలో ప్రసంగిస్తూ కమ్యూనిస్టు పార్టీ ప్రజా విముక్తి సైన్యాలు ప్రజలకు చేసిన అపార సేవను ఉగ్గడించాడు.

బ్రహ్మపుత్ర, పానాఁగ్ నదీతీరం పొడుగునా గల పల్లెల్లో ఇలాంటి సభలు సమావేశాలు ఎన్నో జరిగాయి.

టామస్‌లోని ప్రజలు టిబెట్టు ప్రభుత్వాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. టామంగు చిచి యూచి కార్యాలయ ఉపాధ్యక్షుడు ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ; బ్రహ్మపుత్రనదీ ప్రాంతంలో తిరుగుబాటుదార్లు సాగించిన దారి దోపిడీలు, మానభంగాలు, ఇతర కిరాతకృత్యాలు బట్టబయలు చేశారు.

“ఈ బందిపోటులు నాయింటిని కూడా నాశనంచేశారు. ఈ తిరుగుబాటుదార్లను అణచివేయడంలో ప్రజా విముక్తి సైన్యాలకు సహాయం చేయగలమనే దొక్కటే మనకు మిగిలిన ఆశ” అని అన్నారు

ప్రజా విముక్తిసైన్యం సరకులను సామగ్రిని రవాణా చేయడానికి తాము తోడ్పడాలని గియాంజా ప్రజలు దీక్ష పూనారు.

హిమాలయా పర్వత సానువులలో యాటుంగులో అనేకమంది టిబెట్ దేశీయులు విముక్తి సైన్యాలకు దుర్గమారణ్యాలలోని దోవలను చూపించి సహాయపడ్డారు. ఈ ప్రాంతంలో అవసరమయిన రోడ్లను నిర్మించడానికి తాము సంసిద్ధంగా వున్నామని తెలియజేశారు.

డోంగో జాడ్రా లామామఠంలో జాంగ్ నియమా ఇలా అన్నారు.

“నాకు ముందు స్థానంలోవున్న వారిని చంపినది ఈ ఖూనీకోరులే. వీరు మత సంరక్షకులమని ప్రచారం చేసుకొంటున్నారు. కాని వాస్తవంలో మతాన్ని సర్వనాశనం చేస్తున్నవారు వీరే” తన ఆరామంలోని లామాలందరూ ప్రజావిముక్తి సైన్యాలకు తోడ్పడవలసిందని ఈయన విజ్ఞప్తి చేశారు.

ఉత్తర టిబెట్టులోని, మైదాన ప్రాంతంలో కూడ ప్రజలు ఇదే విధంగా తిరుగుబాటుదార్లను ఖండిస్తూ సభలు జరుపుతున్నారు.

దలైలామా మకాం

ముస్సోరిలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

దలైలామా, ఆయన పరివారమూ ముస్సోరిలో వుండడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు భారత ప్రభుత్వ విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నేడొక ప్రకటనలో తెలిపింది

ఏప్రిల్ 21 ఆ ప్రాంతంలో దలైలామా, సపరివారంగా ముస్సోరికి చేరవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.

హిమాలయ పర్వత ప్రాంతాల్లో రాకపోకలపై ఆంక్ష

తేజ్‌పూర్, ఏప్రిల్ 13

దలైలామా నిన్న బోమ్డిలాకు రావడంతో మిసమారినుండి హిమాలయ పర్వత ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకు వ్యక్తులందరినీ ఖచ్చితంగా ఆపివేశారు.

పర్వతప్రాంతాల్లో ఇప్పటికే వున్న వారిని తిరిగి రానిస్తున్నారు. అయితే వారి సామానులను ఖచ్చితంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే వివిధ దేశాల నుండి వచ్చిన పత్రికా విలేఖరుల గుర్తింపు కార్డులను కూడా పరిశీలించి మరీ రానిస్తున్నారు.

మిసమారి విమానాశ్రయానికి పశ్చిమోత్తరంగా కాపలావున్న పోలీసు ఆఫీసర్లు పి. టి. ఐ విలేఖరితో మాట్లాడుతూ శనివారంనుండి ఆ ప్రాంతంలోని రాకపోకలపై ఆంక్షలు యింకా కట్టుదిట్టంగా అమలు జరపబడతాయని చెప్పారు. ప్రత్యేక పరిమిటులు లేని వారిని పర్వత ప్రాంతాల్లోకి వెళ్ళనీయబోమని తెలిపారు.

లోక్ సభలో ప్రతిపక్షసభ్యుల వాయిదా తీర్మానాలు

తగిన రక్షణచర్యలు తీసుకొంటామని దేశవ్యవహారాల మంత్రి హామీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

రెండురోజులక్రిందట కూచ్ బీహార్ గ్రామంలోకి పెద్దఎత్తున పాకిస్తానీలు అక్రమంగా ప్రవేశించడంపట్ల నేడు లోక్‌సభలో ప్రతిపక్షానికి చెందిన పలువురు సభ్యులు తమ ఆందోళన వెలిబుచ్చారు.

ఈ సమస్యపై సభ్యులు అనేక వాయిదా తీర్మానాలను కూడా ప్రతిపాదించారు.

దేశ వ్యవహారాల మంత్రి పండిత పంత్ మాట్లాడుతూ ఈ సమస్యపై ప్రభుత్వమూ, కాంగ్రెసుపార్టీ కూడా ప్రతిపక్షాలవారితో సమానంగానే ఆందోళన పడుతున్నాయనీ, సరిహద్దు రక్షణకోసం తీసుకోవలసిన చర్యలన్నింటినీ తీసుకొంటున్నాయనీ తెలియజేశారు.

దేశవ్యవహారాల మంత్రి చేసిన వాగ్దానందృష్ట్యా స్పీకరు వాయిదా తీర్మానాలన్నింటినీ త్రోసిపుచ్చారు.

వాయిదాతీర్మానాలను ప్రతిపాదించిన వారిలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ సి. పాణిగ్రాహి, శ్రీ హేమ బారువా (ప్ర. సో), అటల్ బిహారీ వాజపాయి (జనసంఘం) వున్నారు.

ఒక్క రోజులోనే మూడువందల మందికి పైగా పాకిస్తానీయులు కూచ్ బీహార్‌లోని ఒక గ్రామంలో ప్రవేశించి ఆస్తులను లూటీ చేసి, భారతీయులను హింసించిన విషయాన్ని వారు తమ తీర్మానాల్లో పేర్కొన్నారు.

ఈ సంఘటనలు నిజమేనని విదేశాంగ వ్యవహారాల ఉపమంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్ ధృవపరిచారు. ఆ ప్రాంతానికి చెందిన డిప్యూటీ కమిషనర్ నుండి తమకు ఒక టెలిగ్రామ్ చేరిందనీ, రంజాన్ పండుగరోజున 250 మంది పాకిస్తానీయులు కత్తులు కటారులతో భారతీయ గ్రామంపై దాడిచేశారనీ, పదకొండు ఇండ్లకు నిప్పంటించారనీ, 31 పశువులను తోలుకొని పోయారనీ ఆ టెలిగ్రామ్‌లో వున్నదని శ్రీమతి లక్ష్మీమీనన్ తెలిపారు.

దానిని ప్రతిఘటించిన చంద్ర మోహన్ బర్మన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

శ్రీ బారువా : జరిగిన నష్టానికి పరిహారం చెల్లించవలసిందిగా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని మీరు కోరుతున్నారా?

శ్రీమతి మీనన్ : త్వరలోనే మేము పంపబోతున్న అసమ్మతి 'నోట్'లో ఇవన్నీ ఉదహరించబడతాయి.

శ్రీ ఎస్. ఎమ్. బెనర్జీ: సరిహద్దులో మీరు తీసుకొన్న రక్షణ చర్యలేమిటి? 250 మందికి పైగా మన భూభాగంలోకి ప్రవేశించినా ఒక్కరినికూడా అరెస్టుచేసి స్వాధీనం చేసుకోలేక పోయారా.

శ్రీమతి మీనన్ : మామూలు రక్షణకు సంబంధించిన ఏర్పాట్లు చేశాం. ఇది ప్రత్యేకంగా అకస్మాత్తుగా జరిగిన సంఘటన. బహుశా రంజాన్ పండుగ మూలంగా జరిగిందేమో. రక్షణ పోలీసులను నియమించాం. రక్షణకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకుంటున్నాం.

శ్రీ వాజ్‌పాయి: భారత భూభాగాన్ని వారు అతిక్రమించక ముందు సరిహద్దులో రక్షణ పోలీసులు లేరని మేము అర్థం చేసుకోవచ్చునా?

పండిత పంత్ : ఈ సరిహద్దు రక్షణకు ప్రత్యేక చర్యలను తీసుకొన్నాం. అయితే ఈ సరిహద్దు 1500 మైళ్లకు పైగా పొడవువుంటుంది. ఎక్కడో ఒకచోట అకస్మాత్తుగా 250 మందికి పైగా వచ్చిపడితే వారిని పట్టుకొని అరెస్టు చేయడం పోలీసులకు సాధ్యమయ్యే పనికాదు. అవసరమైన రక్షణ చర్యలన్నింటినీ తీసుకోవాలనే విషయంలో ప్రతిపక్ష సభ్యులతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను.

ఒకసభ్యుడు: ఎందుకలాంటి రక్షణ చర్యలను తీసుకోవడంలేదు.

పండితపంత్ : ఈవిషయమై మేము బాధపడుతున్నాం. ఇలాంటి సంఘటనలను పాకిస్తాన్ ప్రభుత్వం అరికట్టక పోవడం దురదృష్టకరమైన విషయం. మేము చేయగల్గినదంతా చేస్తాం.

శ్రీ బారువా: మీరు చెబుతున్న 1500 మైళ్ళ పొడవునా గ్రామాలు లేవు. అక్కడక్కడ మాత్రమే ప్రజలు నివసించుచున్నారు. సరిహద్దు చాలా పొడవున్నదనీ, అందువలన రక్షణ ఏర్పాట్లు చేయలేకపోతున్నామని చెప్పడం ప్రభుత్వానికి పరిపాటి అయింది

స్పీకర్ అవసరమైన చర్యలన్నింటినీ తీసుకొన్నామని ప్రభుత్వం చెప్తోంది. ఇంకా సభ్యులు సంతృప్తిచెందలేకపోతే వారు సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించి, ఏమిచేయవలసి వుంటుందో దేశవ్యవహారాల మంత్రికి సూచనలు చేయవచ్చు.

శ్రీ మహావీరత్యాగి : సరిహద్దులో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు గలవో ప్రభుత్వాన్నుండి కొంత సమాచారాన్ని పొందడానికి మాకు హక్కు గలదో లేదో నేను తెలుసుకోగోరుతున్నాను. తూర్పు సరిహద్దులో ప్రాంతీయ పోలీసు రక్షణ ఏర్పాట్లు ఏమైనా వున్నాయా? వుంటే దాడికి గురైన గ్రామం పోలీసు స్టేషన్‌కు ఎంతదూరంలో వుంది? అక్కడున్న పరిస్థితులలో ఆత్మరక్షణకోసం తుపాకులు వుంచుకోవడానికి లైసెన్సులు యిచ్చారా?

దేశవ్యవహారాలమంత్రి జవాబు చెప్తూ సభ్యులు నిర్దిష్టమైన ప్రశ్నలను పంపిస్తే వాటికి జవాబులు యివ్వగలనని అన్నారు. ఆ సమయంలో దాడిజరిగిన గ్రామానికి ఎంతదూరంలో పోలీసు రక్షణ [illegible] టకే తాను చెప్పలేనన్నారు.

శ్రీ త్యాగి: రక్షణ ఏర్పాట్లనుగురించి మంత్రి ఇలానిర్లక్ష్యంచేయడం అత్యంత శోచనీయం.

పండితపంత్: మాకు టెలిగ్రామ్ చేరిందని చెప్పాం. అందువలన ముఖ్యాంశాలు మాత్రమే ఇప్పుడు మాకు తెలుసు. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతున్నదో ప్రతి ఒక్కరికీ తెలియడం సాధ్యంకాదు. చాలమందికి అనేక విషయాలు తెలియకపోవచ్చు.

ఆ తరువాత స్పీకర్ వాయిదా తీర్మానాలను నిరాకరించుతూ రూలింగ్ యిచ్చారు. ఈ సమస్యపై తగినంత సమాచారం అందిన తరువాత అవ్యవధి ప్రశ్న లడిగేయడానికి సభ్యులకు అవకాశం యివ్వగలనని శ్రీ పంత్ అన్నారు.

జీతాలు చెల్లించనందువల్ల రెండురోజులు పనినిలుపుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారుల వైఖరికి 4,000 ఎన్. ఎం. ఆర్. కార్మికుల నిరసన

విజయపురి, ఏప్రిల్ 10

ప్రాజెక్టు అధికారులు వారం వారం జీతాలు బట్వాడా ఇవ్వనందుకు నిరసనగా నాగార్జునసాగర్‌లోని ఎన్.ఎం.ఆర్. కార్మికులు నాలుగువేలమంది ఈనెల 6, 7 తేదీలలో పనులు మానివేశారు. 7వ తేది సాయంత్రం అధికారులు సుమారు లక్షా పాతికవేల రూపాయలు బట్వాడా చేశారు. తెల్లవారి పనులు మామూలుగా జరిగాయి.

ప్రాజెక్టు అధికారులు కార్మికులకు జీతాలు వారంవారం బట్వాడా యివ్వడంలేదు. ఉన్న ఎన్. ఎం. ఆర్ కార్మికులలోనుండి నాలుగు వందల మందిని తీసివేశారు. తీసివేసిన కార్మికులు తమకు జీతాలు బట్వాడాఅయినా యిప్పించవలసిందిగా కోరారు. అప్పటికేకొందరికి 6 వారాలనుండి 4 వారాల వరకు బట్వాడాలు యివ్వవలసివుంది. ప్రాజెక్టు అధికారులు “డబ్బువచ్చినపుడు యిస్తాము” అని చాలా కటువుగా సమాధానం చెప్పారు. పైపెచ్చు సంక్రాంతి [illegible] వచ్చాయి. “చేసినవాళ్లు పనిచేసి పండుగలకు పస్తులుఉండిరి” అని కార్మికులు పనులు మానివేశారు.

ఆ రెండు రోజులు డామ్‌లో పని పూర్తిగా ఆగిపోయింది. సుమారు 20 వేలు ఖరీదు అయ్యే సిమెంటు కృష్ణలో వేయవలసివచ్చింది ఈ నష్టానికి పూర్తిగా అధికారుల చర్యలే కారణం

ప్రిటోరియా, ఏప్రిల్ 13

రంగుజాతుల వారున్న ప్రాంతాలలో, వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆసుపత్రులన్నిటినీ స్వాధీనం చేసుకోవాలని దక్షిణాఫ్రికా ప్రభుత్వం నిర్ణయించింది.

భారత విదేశాంగ విధానంపై పాక్ వ్యాఖ్య

కాన్‌బెరా, ఏప్రిల్ 13

టిబెట్ సమస్య మూలంగా, భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానం మార్చుకోవచ్చునని పాక్ విదేశాంగ మంత్రి మంజూర్ ఖాదిర్ నేడొక [illegible] లో మాట్లాడుతూ తన ప్రస్తుత విధానం భారతదేశం మార్చుకొనే పరిస్థితి ఏర్పడవచ్చునని ఖాదిర్ అన్నారు

ఇందువల్ల భారతదేశం పాకిస్తాన్‌కు సన్నిహితం కావచ్చుననికూడా ఆయన అన్నారు

“సోవియట్ కూటమికి భారతదేశం ఎదురయ్యేకొద్దీ మాకు సన్నిహితమవుతుంది” అని అన్నారు

సహకార వ్యవసాయ సమస్య

నిపుణులసంఘ పరిశీలనకు పంపామని కాంగ్రెసు కార్యదర్శి

కోటా, ఏప్రిల్ 13

సహకార వ్యవసాయ సమస్యపై నిపుణులసంఘం సలహా తీసుకోవడానికి నిర్ణయించామని అఖిలభారత కాంగ్రెసుకమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ సాదిక్ అలీ నేడిక్కడ తెలియజేశారు.

నిపుణుల సంఘ పరిశీలనకోసం పంపించామంటే, అసలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నామని భావించరాదని ఆయనన్నారు. కేవలం సలహాకోసమే నిపుణులసంఘ పరిశీలనకు పంపించామని వివరించారు.

నాగపూర్ తీర్మానాలను ప్రచారం చేయడానికి ప్రస్తుతం సాదిక్ అలీ రాజస్థాన్‌లో పర్యటిస్తున్నారు.

బెర్లిన్‌పై వెళ్ళే అమెరికా విమానాలు

సోవియట్ ప్రతిపాదనకు అమెరికా నిరాకరణ

వాషింగ్టన్, ఏప్రిల్ 13

బెర్లినుండి పశ్చిమ జర్మనీకి వెళ్ళే అమెరికా విమానాలు 10 వేల అడుగులకన్నా ఎక్కువగా ఎగురకూడదని సోవియట్ యూనియన్ చేసిన ప్రతిపాదనను అమెరికా నిరాకరించింది.

మార్చి 27న అమెరికా విమానం 10 వేల అడుగులకు పైన ఎగిరినందుకు సోవియట్ యూనియన్ ఆక్షేపణ తెలియజేసిన విషయం పాఠకులకు విదితమే. ఆ ఆక్షేపణకు నేడు అమెరికా సమాధానం పంపించింది.

పశ్చిమజర్మనీకి వెళ్ళే విమానాలు ఇంత ఎత్తున పైన ఎగురకూడదని ఆంక్ష విధించే అధికారం సోవియట్ యూనియన్‌కు లేదని అమెరికా చెప్పింది.

ఇంగ్లీషు బోధనా భాషగాగల కాలేజీలకు గ్రాంటులు బంద్

1963-64 తర్వాతవుండే విద్యావిధానం గురించి మద్రాసు ప్రభుత్వ ప్రకటన

మద్రాసు, ఏప్రిల్ 13

1963-64 తరువాత రాష్ట్రంలో ఇంగ్లీషు బోధనా భాషగాగల కాలేజీలకు ప్రభుత్వం గ్రాంటులను బంద్‌చేస్తుందని మద్రాసు ప్రభుత్వం నేడు ప్రకటించింది.

వచ్చే సంవత్సరం నుండి కోయంబత్తూరు ప్రభుత్వ కళాశాలలో పాఠ్యాంశాలన్నీ తమిళంలోనే బోధించబడతాయని తమిళ సంవత్సరాది కానుకగా నేడు ప్రభుత్వం ప్రకటించింది.

1963-64 నుండి మద్రాసు రాష్ట్రంలో అన్ని కాలేజీలలోనూ తమిళభాషనే బోధనాభాషగా ప్రవేశపెడుతున్నామని కూడా ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొన్నది. విద్యనంతటినీ తమిళంద్వారా నేర్చుకొన్న మొదటి బట్టులోని విద్యార్థులు తమ బి. ఎ. డిగ్రీలను 1965-66 లో స్వీకరిస్తారు.

1963-64 తరువాత అంటే ప్రభుత్వ బోధనా భాషను తమిళానికి మార్చిన తరువాత కూడా ఇంగ్లీషునే బోధనా భాషగా వుంచుకోవడానికి ప్రయివేటు కళాశాలలకు అవకాశం యిస్తారు. అయితే ఆ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటులను చెల్లించదు.

బి. యస్ కోర్సును తమిళ భాష ద్వారానే బోధించడం ప్రారంభించిన తరువాతకూడా ఇంగ్లీషు ఒక పాఠ్యాంశంగా కాలేజీలలో వుంటుంది.

తమిళ భాషను బోధనాభాషగా స్వీకరించి బి. ఎ డిగ్రీలను పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వానికి సంబంధంగల ఇతర సంస్థలకు చెందిన ఉద్యోగాల్లోనూ మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కూడా ప్రభుత్వ ప్రకటనలో వుంది.

పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులను చేర్చుకొనే విషయంలో కూడా తమిళ పట్టభద్రులకు ప్రత్యేక అవకాశం యివ్వబడుతుంది.

జోర్డాన్ కమ్యూనిస్టు నాయకుల అరెస్టు

అమ్మాన్, ఏప్రిల్ 13

జోర్డాన్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి ఫుఆద్ ఆబ్ టౌన్ కాస్సర్‌ను మరికొందరు కమ్యూనిస్టు నాయకులను పోలీసు దళాలు నేడు అరెస్టు చేశాయని అధికారయుతంగా ప్రకటించబడింది.

జోర్డాన్ కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం నిషేధించింది.

అమ్మాన్‌కు దక్షిణంగా 20 మైళ్ళ దూరంలోవున్న మదాబా గ్రామంలో వీరిని అరెస్టుచేశారు.

సింహాచలం కొండపైకి రోడ్డు

హైదరాబాద్, ఏప్రిల్ 13

సింహాచలం కొండపైకి తిరుపతి ఘాట్‌రోడ్డువలె ఒక రోడ్డు నిర్మించాలని ఆంధ్రప్రభుత్వం నిర్ణయించింది. మద్రాసు చీఫ్ కన్సల్టింగ్ ఇంజనీయరు శ్రీ నాగేశ్వర అయ్యరును ఇందుకు ఒక పథకం తయారు చేయుటకు నియమించారు.

ఇదే విధంగా శ్రీశైల దేవాలయం నుండి పాతాళగంగవరకు ఒక రోడ్డును వేస్తారు. (వి వి)

బూజుపట్టిన పాత మనస్తత్వం

టిబెటు కల్లోలాలకు మూలకారణమని ప్రధాని నెహ్రూ

హర్ద్వార్, ఏప్రిల్ 13

టిబెట్‌లో కొంతమంది కొత్త మార్పులను తేవడానికి ప్రయత్నిస్తుంటే మరి కొంతమంది బూజుపట్టిన పాత సంప్రదాయాలకు, స్వత్వాలకు అంటిపెట్టుకొని వుండడం వల్లనే ప్రస్తుత ఘర్షణలకు కారణమని ప్రధాని నెహ్రూ నేడిక్కడ అన్నారు.

కొత్త పాతల మేళకలయిక ద్వారా మార్పులను సంతరింపచేసుకోవడమే సరైన విధానమని కూడ శ్రీ నెహ్రూ అన్నాడు.

మద్రాసుకు ప్రధాని నెహ్రూ ఆగమనం

మద్రాసు, ఏప్రిల్ 14

ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ విమానంలో ఈ రోజు మధ్యాహ్నం యిక్కడికి వచ్చారు. ఆయన మద్రాస్ రాష్ట్రంలో నాలుగు రోజులపాటు పర్యటించుతారు.

ఆసియా ప్రజల స్వాతంత్ర్యానికి భారత-చైనాల స్నేహమవసరం

దేశంలోని రాజకీయపార్టీ లన్నింటికీ భారత-చైనా మిత్రమండలి విజ్ఞప్తి

బరోడా, ఏప్రిల్ 13

ఆసియా ప్రజల స్వాతంత్ర్యం, ఐక్యత కోసమూ, ప్రపంచ శాంతికోసమూ భారత-చైనాదేశాల మధ్య స్నేహ సంబంధాలను ఇంకా పెంపొందించేందుకు ఇతోధికంగా కృషి చేయవలసిందిగా భారతప్రజలకు భారత-చైనా మిత్రమండలి వారు విజ్ఞప్తి చేశారు,

భారత-చైనా మిత్రమండలి జాతీయ సమితి సమావేశం యిక్కడ రెండు రోజులుగా జరిగి నేడేముగిసింది.

సమావేశానికి పండిత సుందరలాల్ అధ్యక్షత వహించారు.

మిత్రమండలి ఒక తీర్మానం చేస్తూ టిబెట్ సమస్య కారణంగా భారత-చైనాల మధ్య నేడున్న మైత్రికి ఎలాంటి భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భారతదేశంలోని రాజకీయపార్టీ లన్నింటికీ విజ్ఞప్తి చేసింది.

చైనా ఆంతరంగిక వ్యవహారాల్లో విదేశ సామ్రాజ్యవాదులు జోక్యం కల్పించుకొంటున్నారని మిత్రమండలి తన తీర్మానంలో ఖండించింది. అలాంటి జోక్యం చైనా, టిబెట్టుల భద్రతకేగాక భారతదేశ భద్రతకు కూడా ప్రమాదం తెచ్చిపెట్టగలదని హెచ్చరిక చేశారు.

చైనాను ఐక్యరాజ్యసమితిలో సభ్యురాలుగా చేర్చుకొని, తైవాన్ దీవినుండి అమెరికా సైన్యాలు త్వరగా ఉపసంహరించుకోవలసిన అవసరం నేడు టిబెట్‌లో జరిగిన ఘటనలవలన మరింతగా కనబడుతున్నదని కూడా ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

కరాచీలో అబ్బాస్ ఫర్హాట్

కరాచి, ఏప్రిల్ 13

స్వతంత్ర్య ఆల్జీరియా ప్రధాన మంత్రి అబ్బాస్ ఫెర్హాట్ నేడు ఢిల్లీనుండి కరాచీకి వచ్చారు. ఇక్కడ మూడురోజులుండి, పాకిస్తాన్ మంత్రులతో ఆల్జీరియా సమస్యను గూర్చి చర్చిస్తారు.

ప్రస్తుతానికి డల్లెస్ రాజీనామా ప్రసక్తిలేదట

వాషింగ్టన్, ఏప్రిల్ 13

అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ ఇంకా చికిత్స చేయించుకోవాలని అనుకొన్నారు కాబట్టి, ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా వుందో స్పష్టంగా తెలిసేవరకూ ఆయన విదేశాంగమంత్రిగా పని చేయడమా లేదా అనే విషయంపై ఎలాంటి నిర్ణయమూ జరగదని అధికారయుతంగా ప్రకటించారు.

అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, ఆసుపత్రిలో వున్న డల్లెస్‌ను చూచివచ్చిన తరువాత, అధ్యక్షుని ప్రతినిధి జేమ్స్ హాగర్టీ పత్రికా విలేఖరులకు ఈ విషయం వెల్లడించారు. ఆయన ఇలా అన్నారు :

“విదేశాంగమంత్రి ఇంకా కొద్ది రోజులు ఆసుపత్రిలో వుంటారు. డల్లెస్‌ను వైద్యులు పరీక్షించి ఆయన ఆరోగ్యపరిస్థితి ఎలావుందో నిర్ణయించిన తరువాతగాని అధ్యక్షులు ఐసెన్‌హోవర్ ఏ ప్రకటనా చేయరు.

టిబెట్‌లో గాయపడినవారికి బొంబాయినుండి వైద్యసహాయదళాన్ని పంపించాలని కార్పొరేషన్‌లోని ప్రజాసోషలిస్టు సభ్యులు ఒక తీర్మానం ప్రతిపాదించారు.

వికారి నామ సంవత్సర
చాంద్రమాన చైత్రమాసం
శుద్ధ సప్తమి రా. 7-36
ఆరుద్ర ఉ. 8-49

విశాలాంధ్ర

బుధవారం 15-4-1959

న్యాయనిర్వహణ

తక్కువ ఖర్చుతో, త్వర త్వరగా న్యాయం చేకూరాలన్న ప్రజల ఆశలను సఫలం చేయాలంటూ కేరళ గవర్నరు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు విజయవాడ బార్ అసోసియేషన్ వార్షికసభలో వెల్లడించిన అభిప్రాయాలు ప్రతి ఒక్కరూ గమనించదగినవి.

బ్రిటిష్ వారి న్యాయవిధానంతో విసిగి వేసారిన మన దేశంలో ఇట్టి అభిప్రాయాలు కొత్తకానిమాట వాస్తవం. గాంధీజీ దగ్గర నుంచి నేటి లాకమిషన్ వరకూ ఎందరో, ఎన్నో సందర్భాల్లో చెప్పిన మాటలే యివి.

అయితేనేం? స్వరాజ్యం వచ్చి పన్నెండేళ్లు కావస్తున్నా న్యాయ నిర్వహణలో గాని, న్యాయస్థానాల విచారణ తీరులోగాని, న్యాయమూర్తుల ప్రవృత్తిలోగాని ఏ కమెత్తు కూడామార్పు కల్పించటం లేదు.

ఏళ్ల తరబడి వాయిదాలు పడుతూ ఎన్నో కేసులు నేటికీ కోర్టుల్లో మూలుగుతున్నాయి. ఫలితంగా న్యాయంకోసమని కోర్టుకు పోయిన వారు చాల వ్యయప్రయాసల[illegible] లోను కావలసి వస్తున్నది

సివిల్, క్రిమినల్ కోర్టులన్నింట్లోనూ – అవి మున్సబ్ కోర్టయినా, మేజిస్ట్రేట్ కోర్టయినా, జిల్లాకోర్టయినా, చివరకు హైకోర్టయినాసరే – యీ పడిగాపులు తప్పటంలేదు.

వాదులు – ప్రతివాదులు, కక్షిదారులు – ముద్దాయిలు సాక్షులతో సహా ప్రొద్దున 11 గంటలనుంచి సాయంత్రం 5 గంటలదాకా కోర్టులవద్ద పడి వుండటం, మళ్లీ ఏపదిరోజులకో, పదిహేనురోజులకో వాయిదా పడటం మన కోర్టుల్లో సర్వసామాన్యమైన విషయం.

వాయిదాకు వచ్చినవారు కాస్త కూర్చోటానికైనా ఆ కోర్టుల్లో చోటుంటుందా? ఏ చెట్టుకిందనో, ఏ వరండామీదనో కాలక్షేపం చేయవలసిందే గాని – ఆంధ్రదేశమంతా గాలించినా–గబ్బిలాల కొంపల్లా వుండే ఆ కోర్టుల్లో మాత్రం అందుకు తగిన సదుపాయం కల్పించదు.

అనేక కోర్టుల్లో కూర్చోటానికి కుర్చీకూడా లేక, న్యాయవాదులకే 'నిలువుకాళ్ళ జీతం' తప్పనప్పుడు, ఇక సామాన్యుల సంగతి చెప్పేదేమున్నది?

ఇన్ని యిబ్బందులు పడిపడి, రెండు మూడేళ్ళు గడిస్తేగాని మనకోర్టుల్లో కేసులు పరిష్కారం కావటంలేదు.

ఈ జాప్యంవల్ల కొన్నికొన్ని సివిల్ కేసుల్లో న్యాయంకోసమని వెళ్లిన మొత్తంకన్నా ఖర్చులే అధికమవటం కూడా కద్దు. ఒక్కొక్క వాయిదాకూ సాక్షులతోసహా ఉభయపార్టీలకూ అయ్యే ప్రయాణఖర్చులు, సాదరు ఖర్చులూ లెక్కవేసి, మొత్తం వాయిదా లకన్నిటికీ అయ్యే ఖర్చు లెక్క కడితే ఇలాంటి వెన్నైనా ఉదాహరణలు దొరుకుతాయి.

ఈవిచారణలంతు, న్యాయం కోసం యీ వ్యయ ప్రయాసలు అంతూపొంతూ లేకుండా ఏళ్ళ తరబడి జరుగుతుండటం చాల అక్రమం. ప్రస్తుత న్యాయశాస్త్రంలోని వివిధ విభాగాల్లోనూ సమగ్రమైన సంస్కరణలు తెచ్చి, రష్యాలోవలె ఏమూడు వారాల్లోనో కేసులుపరిష్కారమయ్యే విధానం అవలంబించక పోతే, రానురాను, యీన్యాయస్థానాలపై ప్రజల కొకరకమైన ఏవగింపు ఏర్పడటం తథ్యం.

కనుక ప్రభుత్వంసకాలంలో తగు చర్యలు తీసుకొని తక్కువ ఖర్చుతో త్వరితంగా న్యాయం చేకూరేట్లు చూడటం ఎంతేని అవసరం.

తెలంగాణాలోని మధ్యమ తరగతి ఉపాధ్యాయుల వేతనాలు

ప్రభుత్వ ఉత్తర్వు

హైద్రాబాద్, ఏప్రిల్ 13

మధ్యమ శిక్షణ పొంది, మధ్యమ తరగతిలో ఉత్తీర్ణులై తెలంగాణాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులు కాక పోయినప్పటికీ వారికి వరుసగా 44-98½, 42-54 చొప్పున వేతనం యివ్వడానికి అర్హులేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వు చేసినట్లు తెలుస్తోంది.

మధ్యమలో శిక్షణ పొందినవారు, మధ్యమ తరగతిలో ఉత్తీర్ణులైనవారు విధిగా మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులైతే తప్ప వారికి ఈపై స్కేళ్ళు వర్తించవని పూర్వపు హైద్రాబాద్ ప్రభుత్వం ఒక నిబంధన చేసింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఈ సమస్యకు ప్రాధాన్యత ఏర్పడింది. అనేక వేలమంది మధ్యమ తరగతి ఉపాధ్యాయులు ప్రమోషన్లు లేకుండా ఉండి పోయారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ఈ సమస్యపై ఆందోళనచేసి పూర్వపు నిబంధనలను రద్దుచేయాలని కోరింది. ఫలితంగా ప్రభుత్వం ఒక ఉత్తర్వును జారీచేస్తూ మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులు కాకపోయినా ఈ ఉపాధ్యాయులకు ఎక్కువ స్కేళ్ళు యివ్వవచ్చునని తెలియజేసింది. (వి.వి.)

బ్రిటన్‌లో త్వరలో ఎన్నికలు

లండన్, ఏప్రిల్ 13

బ్రిటన్‌లో త్వరలోనే జనరల్ ఎన్నికలు జరుగుతాయని బ్రిటన్ ఆర్థిక మంత్రి నేడు బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానం చెప్తూ సూచనప్రాయంగా అన్నారు.

'కాంగ్రెసునుండి రాజీనామా ఇవ్వడానికికూడా జంకను'

కాంగ్రెసు కార్యకర్తలకు శ్రీమతి ఇందిరా గాంధీ హెచ్చరిక

కాన్పూర్, ఏప్రిల్ 13

కాంగ్రెసు తన లక్ష్యాలకు దూరమవుతున్నదని తోచే పక్షంలో కాంగ్రెసును విడిచిపెట్టి బయటకు వెళ్లటకుతాను వెనుదీయనని కాంగ్రెసు అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా గాంధీ నిన్న యిక్కడ కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు.

"మా తండ్రికీ, మా తాతకు కాంగ్రెసుతో దీర్ఘకాలం సంబంధం వున్నదన్న విషయం వాస్తవమే. కాని అది నాకంత ముఖ్యంకాదు. కాంగ్రెస్ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిందన్న విషయమే నాకు ముఖ్యం. కాంగ్రెసు సాధించిన గొప్ప విజయమది".

సోషలిస్టు లక్ష్యాలను కాంగ్రెసు ఆమోదించకముందుతాను కాంగ్రెసులో సభ్యురాలుగా చేరలేదనికూడా శ్రీమతి ఇందిరాగాంధీ చెప్పారు.

కాంగ్రెసుకు ఏదైనా ప్రమాదం వున్నదంటే అది బయటనున్న వారికంటేగాక సంస్థలో వున్నవారి నుండేనని కూడా ఆమె అన్నారు.

సోషలిస్టు లక్ష్యాలను కాంగ్రెసు కార్యకర్తలు ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు.

సంస్థలో లక్షల సంఖ్యలో సభ్యులుండటంకంటే లక్ష్యాన్ని గట్టిగా విశ్వసించి అందుకోసం దీక్షతో పని చేసేవారు కొద్దిమంది వున్నా సరిపో గలదని శ్రీమతి ఇందిర అన్నారు.

ముందుకు సాగిపోవ డానికి దృఢనిశ్చయం

వారణాసి, ఏప్రిల్ 13

దేశంలోని ప్రజలందరూ ముఖ్యంగా కాంగ్రెసు సిద్ధాంతాలను విశ్వసించే వారంతా సహకరించగలరనే విశ్వాసం వుండబట్టే తాను కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరించడానికి అంగీకరించానని శ్రీమతి ఇందిరాగాంధీ నేడిక్కడ మాట్లాడుతూ అన్నారు.

ప్రజల్లో చిన్న భాగం మన సిద్ధాంతాలను, విధానాలను అంగీకరించక పోయినప్పటికీ మన లక్ష్యాలను సాధించేందుకు ముందుకు సాగిపోదామనే దృఢ నిశ్చయంతో వున్నామని ఆమె చెప్పారు. మన దేశం సౌభాగ్యవంతం కావాలంటే ఈ లక్ష్యాలు నెరవేరడం అవసరమన్నారు.

ఎన్నికలలో మత ప్రమేయం

కాథలిక్కులపై పోప్ ఆంక్ష

వాటికన్, ఏప్రిల్ 13

కమ్యూనిస్టులతో చేరి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకుగాని, లేక కమ్యూనిస్టుల సహాయం పొందే అభ్యర్థులకుగాని, కాథలిక్కులెవ్వరూ ఓటివ్వకూడదని పోప్ జాన్ నేడు ఉత్తర్వు చేశారు.

"కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చనే"

ఒక మహా నాయకుడు విజయవాడ పట్టణానికి విచ్చేశాడు. మహానాయకుడని ఎందు కంటున్నారా? వారు ఒకానొకప్పుడు కమ్యూనిస్టు. 1946 ఎన్నికల్లో యం. యల్. ఎ అయ్యే ఛాన్సు యిప్పిస్తానని కళావారు దువ్వితే గభాలున కాంగ్రెసు బోటులో కాళ్లు పెట్టారు.

కొత్తగా స్వరాజ్యం వచ్చిన ఆ సంవత్సరాల్లో యం. యల్. ఎ అంటే సామాన్యంగాదు. "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ" అన్నట్లు జేబులు నింపుకున్న వారికి నింపుకున్నంతగా పర్మిట్లు, లైసెన్సులు, బస్సు రూట్లు చుట్టూ కమ్ముకొని వుండేవి. దానికితోడు దేశ సేవకులే పాలకులయ్యారు గనుక "ప్రభుత్వ భూములు పంచండి! పంచండి!" అన్నారు. ఎవరికి? దున్నుకునేవారికి, దున్నుకుంటున్న వారికీ గాదు. రాజకీయ బాధితులకు. అందులోను ఈయన మహానాయకుడు గనుక మంచిఛాన్సు వచ్చింది. పదెకరాల పాటిమట్టిదిబ్బ పూరకేనే పడుండటమెందుకని పట్టా పుచ్చుకొన్నారు. అదంతా 'ప్రజా స్వామిక' యుగం?

తర్వాత "నిరంకుశ" శక్తులు ప్రబలిన యుగం ఒకటి వచ్చింది. అంటే ఆ "నిరంకుశశక్తుల" పరిపాలనకే వచ్చాయనిగాదు. ఎక్కువగా ప్రజల ఆదరణపొంది, పాలకవర్గానికి అంకుశంగా తయారయ్యాయి. పాపం! మన మహా నాయకుడు ఆ "నిరంకుశ" శక్తికి సంబంధించిన అభ్యర్థి చేతుల్లో చిత్తుగా ఓడిపోయారు. దాంతో ఆయన యం. యల్. ఏ. పదవి పోవడమే గాదు. పదెకరాల పాటి దిబ్బకు కూడా ఎసరువచ్చింది. ఈ "నిరంకుశ వాదు" లున్నారే వారు శాసనసభలో ఆందోళన చేసేసరికి అప్పటి ముఖ్యమంత్రి శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచార్యుల వారు ఆ పదెకరాల పాటిదిబ్బ తాలూకు తాత్కాలిక పట్టాకు 'స్టే' ఆర్డరు యిచ్చారు.

ఇక్కడే కథలో ఉపకథ ఒకటున్నది. పుత్తూరులో 1958 లో ఒక ఉపఎన్నిక వచ్చింది. మన మహా నాయకుడు ఆ ఎన్నికల ప్రచారం సందర్భంలో అదేపనిగా సవాళ్ళు చేస్తూంటే ఎవరో జరిగినదంతా బైటపెట్టారు. అదేమిటని ఓటర్లు ప్రశ్నించారు. గోదావరి జిల్లాకూ చిత్తూరుజిల్లాలోవున్న పుత్తూరుకు దూరంచాలావున్నది. నిజం అంతదూరం ప్రయాణం చేయదని మన కథానాయకుడి నమ్మకం. కనుక పుత్తూరు బహిరంగసభలోనే "జగంమిథ్య, పలాయనం మిథ్య" అన్నట్లు "నేనేమిటి? భూమి తీసుకోవడమేమిటి? ప్రభుత్వం స్టే ఆర్డరు యివ్వడం ఏమిటి? అంతా అబద్ధం!"అని 'సత్యం' నొక్కి వక్కాణించారు. ఏమైనా 'నిరంకుశ శక్తుల' బలం శాసనసభలో కొంచెం ఎక్కువగా వున్నందున శ్రీ వారు 'కాలు కాలిన పిల్లిచందం'గానే మూడేళ్ళు పాటు తిరగవలసి వచ్చింది.

1955 ఎన్నికలముందు 'నిరంకుశశక్తులకు' ఆదరణ పెరిగింది. ప్రమాదం యింకా ముంచుకవచ్చేలా ఉంది. చిన్న వాగ్దానాలు సరిపోయేట్టులేవు. కొద్దిపాటి అబద్ధాలా చలామణీ అయ్యేట్టులేవు. అందుకని 'నిరంకుశ శక్తులే అధికారానికివస్తే ముసలివాళ్లను నరికివేస్తారనీ, కంచం మంచం అన్నీ పంచేస్తారనీ, దేవుడూ దెయ్యం, మతం ఆచారం, మంచీచెడ్డా అన్నీ ఎగిరి పోతాయని మన మహానాయకుడి సహచరవర్గం దుమారం లేపింది. ప్రతి పక్షం బలంగా వున్నందునే రైతులపై మూడు సంవత్సరాలపాటు అదనపు పన్నులభారం పడలేదని 'నిరంకుశ శక్తులు' చెప్పగా "అంతేనా? మేము యీసారి అధికారానికి వచ్చిన తర్వాత పదిరూపాయలలోపు శిస్తుకట్టే వాళ్ళకు శిస్తుబాధనుండి విముక్తి చేకూర్చుతా"మని కథానాయకుడి పక్షం వాగ్దానం చేసింది. ఇరవై యెకరాల మాగాణి, అరవైయెకరాల మెట్ట గల కమతాలకు పరిమితిపెట్టి మిగతా భూమిని పేదలకు పంచాలని 'నిరంకుశ వాదులు' చెప్పారు. అంటే 'యింకేమున్నది నీ కుంటా సెంటూ భూమిని కొట్టేస్తున్నారు రైతా' అని శ్రీవారి పరివారం గాథరాపెట్టింది. సోషలిస్టు సమాజం మంచిదని 'నిరంకుశవాదులు' చెప్పారు. సోషలిజం అంటే పంగనామాలు తీసేసి కుత్తికాడవరకే ముద్ర వేయడం అనీ, అందర్నీ గాటినకట్టడం అనీ కథానాయకుడి పార్టీవారు, వారి వందిమాగధులు పాడారు. మొత్తానికి దుమారం పనిచేసింది "ప్రజాస్వామిక వాదులు" "నిరంకుశ వాదుల్ని" ఓడించారు.

గొప్పఫలితాలు వచ్చాయి! మిగతా వాటిమాటెలావున్నా మహానాయకుడికి 'స్టే' ఆర్డరు నుండి విముక్తి వచ్చింది. పదెకరాల పాటి దిబ్బకు మళ్ళీ 'ప్రజా స్వామికం పుణ్యమా' అంటూ పట్టా వచ్చింది. ఇక ప్రజలకుచేసిన వాగ్దానా లంటారా? అందులో తికమకలు చాలా వచ్చాయి. పదిరూపాయల లోపు శిస్తు రద్దు వాగ్దానం 'ప్రజా స్వామిక' వాదులు' గద్దె ఎక్కంగానే రద్దయింది. శిస్తు రద్దు లేకపోగా గత నాలుగు సంవత్సరాలూ అదనపు శిస్తును రైతులపై రుద్ది వదులుతున్నారు.

మరోవైపున ఎన్నికల్లో యీసడించిన సోషలిజాన్ని తామూ ఎత్తి ముద్దు పెట్టుకోకపోతే ప్రయోజనంలేదని ఆవడిలో 'ప్రజాస్వామిక వాదు'లు తీర్మానించుకున్నారు. 'కుంటా, సెంటూ పోతుంద'ని గాథరాపెడితే తాత్కాలికంగా ఓట్లు వచ్చినా ఆ నినాదానికి అట్టే రోజులు లేవని గ్రహించారు. 'నిరంకుశవాదులు' ప్రచారంలోపెట్టిన ఇరవై ఎకరాల మాగాణి పరిమితిని కొక్కెంక్రింద మార్చి రు. 3600/- లు నికరాదాయం గల భూమికి పరిమితిని మేమూ పెడతాం అని కేకలు వేశారు.

ఉత్తుత్తి కేకలు మహా నాయకుడికి నచ్చవు. గట్టి ప్రయోజనానికే ఆ కేకల్ని ప్రయోగించారు. తన నాయకుణ్ణి ముఖ్యమంత్రిని చేస్తే ఆ కేకలు అమల్లోకిరావడంతథ్యం అని పూరూరా చాటారు. ఆ విధంగా మహానాయకుడి నాయకుడు ముఖ్యమంత్రి అయ్యారు. మహానాయకుడికి ఆలిండియా ర్యాంకు వచ్చింది.

మరి మహానాయకుడు వాగ్దానం చేసిన భూసంస్కరణలు ఏమైనాయి? రు 3600 ల పరిమితి 5400 కు పెరిగి, సమగ్రాసం మినహాయింపుతో రు 7200 లై, అందులో కుటుంబంలో గల పిల్లా జెల్లా అందరికీ ఆ వంతున వదిలితే అది అయిదుగురు కుటుంబానికి రు 36 వేల నికరాదాయపు పరిమితికి చేరుతున్న బిల్లురూపంలోకూర్చున్నది. ఈలోగా యకరం కూడా పంపకానికి మిగల్చకుండా చక్కగా పంపకాలు, అమ్మకాలు సాగించుకోమని అవకాశం యిచ్చారు. మహానాయకుడు తన ప్రాంతపు మోతుబరి పరివారాన్నందరినీ చేర్చి ఆ మధ్య ఆదే సలహా యిచ్చారు. ఇక మిగిలినభూమినిసహకారవ్యవసాయ క్షేత్రాలకు 'భూరి విరాళంగా' ఇస్తారట మహానాయకులు! సంతోషించాలి పేదజనం!

మహానాయకుడు మరొకందుకు కూడా పేరు మోగాడు. 'నిరంకుశ శక్తుల'ను వ్యతిరేకించే పేరిట అపార్టీనీ, ఆపార్టీని [illegible] కొందరుకూడగట్టారు. మొదట ఆ రెండు పార్టీలవారికీ శాస్త్రా కూస్తా బాధ్యత లిచ్చారు. నెమ్మదిగా శ్రీ వారి అధ్వర్యాన 'ఐక్య పక్షం' నుండి ఒక్కొక్క పార్టీని, ఒక్కొక్క మంత్రిని బైటికి సాగనంపారు. ఇప్పుడు ఐక్యపక్షాన్ని ఏకపక్షం చేయడానికీ, ఇన్ని మతాలకు గాకుండా ఒకేమతా మంత్రిపదవు లన్నింటినీ గుత్తకు పుచ్చుకొందుకూ తోడ్పడ్డారు.

* * *

సూక్ష్మంలో మహానాయకుడి కథ అది. స్వార్థంలోనూ, రాజకీయాల్లోనూ అవకాశవాదం మూర్తీభవించిన వ్యక్తి యీ మహానాయకుడు. పేదలకు ముందు భూమి పంచితేనే సహకార క్షేత్రాలకు ఐచ్ఛిక ప్రోత్సాహం చేకూరుతుందని కమ్యూనిస్టులు లోగడ చెప్పారు; ఇప్పుడూ చెబుతున్నారు. 1959 లో వ్యవసాయ సంస్కరణలను అమలు జరపాలనే నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాలను హర్షిస్తున్నారు. అదేసమయంలో తెనాలి రామలింగడు ఉడుకుపాలతో పిల్లిమూతికాల్చినట్లు, వ్యవసాయసంస్కరణలన్నా సహకార వ్యవసాయ క్షేత్రాలన్నా 'మాకు వద్దు బాబూ' అనే స్థితికి పేదలను దిగజార్చవద్దని హెచ్చరిస్తున్నారు. అవకాశవాదంలో పుట్టి పెరిగిన మహానాయకుడికి యీ వైఖరి అవకాశ వాదంగానూ, అంగులోనూ "నీచమైన అవకాశవాదంగా"నూ కనపడటంలో విడ్డూరంలేదు. సన్మాన సందర్భం, శుద్ధి, మర్యాద మన్ననా లేకుండా 1955 ఎన్నికల్లో అబద్ధాలతో స్వార్థాన్ని అమాయకత్వాన్నీ రెచ్చగొట్టడాన్ని, 'నిరంకుశవాదులకు' వ్యతిరేకంగా జరిగిన ఘనమైన ప్రచారంగా, పేర్కొనడం మహానాయకుడికే చెల్లుబాటు! కాని రైతాంగంలో ఆనాడు సోషలిజానికీ, వ్యవసాయసంస్కరణలకూ వ్యతిరేకంగా రెచ్చగొట్టిన ప్రచారఫలితమే యీనాడు నాగపూర్ తీర్మానాలకూ ఎదురుతిరుగుతోందని గుర్తించడం చిత్తశుద్ధిగలవారికేసాధ్యం.

ప్రదేశ్ పత్రికా రచయితల నాల్గవ మహాసభ

ఈ నెల 28 వ తేదీన కొత్తగూడెంలో

హైద్రాబాద్, ఏప్రిల్ 13

ఆంధ్రప్రదేశ్ పత్రికా రచయితల నాల్గవ మహాసభ కొత్తగూడెంలో ఈ నెల 28 వ తేదీన జరుగనున్నది.

శ్రీపండితారాధ్యుల నాగేశ్వరరావు గారు సభ కధ్యక్షత వహిస్తారు. శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు సభను ప్రారంభిస్తారు.

కాంగ్రెస్ శాసనసభ్యులు శ్రీ కె. సుబ్రహ్మణ్యరావుగారు అధ్యక్షులుగా, సింగరేణి బొగ్గుగని కార్మికసంఘ కార్యదర్శి శ్రీ పర్సా సత్యనారాయణ, న్యాయవాది శ్రీ టి. వెంకటప్పయ్య గార్లు ఉపాధ్యక్షులుగా, పత్రికా రచయిత శ్రీ ఏమ్. కె. మూర్తి కార్యదర్శిగా ఆహ్వానసంఘం ఏర్పడింది. మహాసభ జయప్రదంగా జరపడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. మహాసభ అనంతరం పత్రికా ప్రతినిధులకు బొగ్గు గనులను చూపించే ఏర్పాటు జరుగుతోంది. (వి.వి.)

కేంద్ర కనీసవేతనాల సలహాబోర్డు

శ్రీ సత్యనారాయణరెడ్డికి సభ్యత్వం

హైద్రాబాద్, ఏప్రిల్ 14

కేంద్ర కనీస వేతనాల సలహా బోర్డులో ఒక సభ్యుడుగా ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి ఐన శ్రీ ఎస్. సత్యనారాయణ రెడ్డిగారిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ శ్రీ సత్యనారాయణ రెడ్డి పేరును సూచించింది.

కనీసవేతనాల చట్టంక్రిందకు వచ్చే అన్ని పరిశ్రమలలోను ఇదివరకు ఉన్న వేతనాలను పునర్నిర్ణయించడం లేదా సవరించడం ఈ బోర్డు చేసేపని. (వి. వి.)

సోషలిజాన్ని వ్యతిరేకించ డానికి మితవాద పక్షం

నిర్మించాలని శ్రీ రాజగోపాలాచారి

మద్రాసు, ఏప్రిల్ 14

భారతదేశ ప్రస్తుత పరిస్థితులలో మితవాద పక్షాన్ని ఏర్పరచడం ఒక్క సోషలిజాన్ని ప్రతిఘటించడానికే గాక, ప్రభుత్వం అవలంబించే తప్పు విధానాలన్నింటిని నిర్భీతిగా ఎదుర్కోవడానికికూడా అవసరమని శ్రీమాన్ రాజగోపాలాచారి నేడిక్కడ అన్నారు.

నేటి భారత ప్రభుత్వ విధానాలు ఇదేవిధంగా కొనసాగితే సైనిక పరిపాలన ఏర్పడే ప్రమాదం ఉన్నట్టు ఆయన చిత్రించారు.

భారత ప్రభుత్వం బ్రేకులు లేని మోటారు బండివలె పరుగెత్తుతోందనీ, అందుచేత ఈ పరుగును ఆపుచేయడానికి దేశంలో ఒక మితవాదపక్షాన్ని ఏర్పరచడం అవసరమనీ ఆయన అన్నారు.

'భారతదేశంలో మితవాద రాజకీయ పక్షం ఆవశ్యకత' అన్న విషయంపై జరిగిన గోష్టికి అధ్యక్షత వహిస్తూ శ్రీ రాజగోపాలాచారి పై విధంగా అన్నారు.

ఈ పార్టీకి 'బ్రేక్' పార్టీ అని శ్రీ రాజగోపాలాచారి పేరు పెట్టారు. ఈ 'బ్రేక్' పార్టీ ప్రభుత్వాన్ని నిలవేసి వివిధ విషయాలపై ఆలోచించేటట్లు చేస్తుందనీ, ఆ విధంగా సక్రమమైన విధానాలను రూపొందించడానికి వీలుకల్పిస్తుందనీ అన్నారు.

ప్రస్తుత పరిస్థితులు ఇదే విధంగా సాగితే దేశంసర్వనాశనమయ్యే పరిస్థితి రాకతప్పదనీ, సైన్యం అధికారాన్ని చేత బుచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుందనీ అన్నారు. దూరదృష్టితోచూస్తే మనకు ఈ విషయం స్పష్టంగా కనపడుతోందని ఆయన అన్నారు.

'బ్రేక్' పార్టీని, మితవాదపక్షమని పిలవడానికి కొందరు బిడియపడుతున్నారనీ, మితవాద పక్షమని ఆ పార్టీకి పేరు పెట్టడానికి తనకు ఎట్టి ఆక్షేపణ లేదనీ అన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్టు తదితరపార్టీలు ఓటర్లకు వాగ్దానాలు చేయడంలో ఒకరితోకరు పోటీపడుతున్నాయనీ, ఎక్కువవోట్లు సంపాదించే దృష్టితో తమ విధానాలను రూపొందించుతున్నాయనీ శ్రీరాజగోపాలాచారి అన్నారు. ఒకదానికంటె మరొకటి వామపక్ష పార్టీలవలె మాట్లాడుతున్నట్లు తెలియజేశారు. ఇతర పార్టీలకంటె ఎక్కువ ఆకర్షణీయమైన విధానాలను కల్గి ఉంటేతప్ప అధికారంలో ఉండబోమనే భయం కాంగ్రెస్‌ను పట్టుకొని పీడిస్తున్నదని అన్నారు. వోట్లుతెచ్చుకొనే మార్గాలు అవలంబించకపోతే కమ్యూనిస్టులు తమ్ము అధికారంలోంచి లాగివేస్తారని కాంగ్రెస్ భయపడుతున్నదని అన్నారు.

రష్యాఅంటే అమెరికాకు ఎంత సింహస్వప్నంగా ఉందో, కమ్యూనిస్టులంటె కాంగ్రెస్‌కు అంత సింహస్వప్నంగా ఉందనీ అందుకేతాను నిర్ణయించిన విధానాలు ప్రజానుగుణ్యంగా ఉంటాయో ఉండవో యోచించుకొనే శక్తి కాంగ్రెసుకు లేకుండా పోతూందని అన్నారు.

ఇటువంటి ఆకర్షణీయమైన విధానాలను అవలంబించి నప్పటికీ రావలసినన్ని వోట్లు వస్తున్నాయో లేదో కాంగ్రెసువాదులు గమనించాలని అన్నారు. (మద్రాసు కార్పొరేషన్ ఎన్నికలు ఐన తరువాత శ్రీ రాజగోపాలాచారి ఈ ప్రసంగం చేశారు.)

కొత్త పార్టీని నిర్మించడానికి దేశమంతా తిరగడానికి తనకు ఓపికలేదనీ, అయితే దేశమంతటా జిల్లా, తాలూకాల స్థాయిలో మితవాదపక్ష నిర్మాణానికి తగుఏర్పాట్లు జరగాలనీ అన్నారు.

కాంగ్రెస్ పక్షంలోనే నాగపూర్ తీర్మానాన్ని వ్యతిరేకించేవారు గణనీయంగా ఉన్నారని రాజగోపాలాచారి అన్నారు.

మితవాద పక్ష నిర్మాణం కేవలం సోషలిజాన్ని ప్రతిఘటించడానికే గాక ప్రభుత్వం ఏ రాజకీయ సిద్ధాంతాన్ని అవలంబించి నప్పటికీ లెక్కచేయకుండా అదిచేసే తప్పులన్నింటిని నిర్భీతిగా వ్యతిరేకించాలనీ అన్నారు.

సాంకేతిక విద్యాలయాల ఆవశ్యకత

కేంద్రమంత్రి శ్రీ కబీర్ వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

సాంకేతిక విద్యాలయాల్లో పని చేస్తున్న అధ్యాపకుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మొదటి ప్రాధాన్యత నివ్వాలని శాస్త్రీయపరిశోధన, సాంస్కృతిక వ్యవహారాలశాఖామంత్రి శ్రీ హుమయూన్ కబీర్ నేడిక్కడన్నారు.

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలం పూర్తి అయ్యేటప్పటికి భారతదేశంలోని ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక సాంకేతిక విద్యాలయమైనా వుండేటట్లు చూడాలన్నారు.

అఖిలభారత సాంకేతిక విద్యాసమితి అధ్యక్షులైన శ్రీ కబీర్ సమితి 12 వ సమావేశంలో ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు.

ఇప్పుడున్న సాంకేతిక విద్యాలయాల్లో ఉదయం, సాయంత్రం కోర్సులను ప్రవేశపెట్టి వున్న అవకాశాల్లో హెచ్చుమందికి సాంకేతిక శిక్షణ యివ్వడం అవసరమని కూడా శ్రీ కబీర్ సూచించారు. ఈ పద్ధతిని ముందుగా పెద్ద నగరాల్లో ప్రవేశ పెట్టడం అవసరమన్నారు.

జర్మనీ బ్రిటన్లమధ్య ఏకీభావ ముంటుంది

పశ్చిమజర్మనీమంత్రి ప్రకటన

న్యూయార్కు, ఏప్రిల్ 13

జర్మనీ సమస్యను ఎలా పరిష్కరించాలనే సమస్యపై పశ్చిమ జర్మనీకి బ్రిటన్‌కు మధ్య నూటికి 95 పాళ్ళు ఏకీభావం కలదని పశ్చిమ జర్మనీ రక్షణ మంత్రి హెర్ జోసెఫ్ నేడన్నాడు.

లండన్‌కు బాన్‌కు మధ్యగల విభేదాలు పెద్దవికావని అవి నామ మాత్రమయినవని అన్నారు.

యూరోపులో నిస్సైనిక ప్రాంతమొకటి ఏర్పాటు చేయడానికి తాను వ్యతిరేకంకాదు గాని, అలాంటి ఒడంబడిక రాజకీయ సైనికవిషయాల కన్నిటికీ అన్వయించేదిగా వుండాలని అన్నారు.

రాజకీయంగా ఉద్రిక్త వాతావరణం ఇలానే కొనసాగుతూండగా, సైనిక శూన్యమైన ప్రాంతాన్ని యూరపులో సృష్టించడం ప్రమాదకరమని అన్నారు. ఆయుధాలు తగ్గించినంత మాత్రాన ప్రయోజనంలేదు. రాజకీయ సమస్యల్ని పరిష్కరించాలి అని అన్నారు.

శిఖరాగ్ర సమావేశంలో బేరాలు చేయడానికి తనకు ఉపయోగంగా వుంటుందని కృశ్చేవ్ బెర్లిన్ సమస్యపై సంక్షోభం తెచ్చిపెట్టారని ఆరోపించారు.

ప్రభుత్వ వైఖరికి ఉద్యోగుల నిరసన దినం

ఏప్రిల్ 16వ తేదీన జరుపవలసిందిగా సంయుక్త కార్యాచరణ సంఘం విజ్ఞప్తి

హైద్రాబాద్, ఏప్రిల్ 14

ఏప్రిల్ 16వ తేదీన రాష్ట్రమంతటా గల ఎన్. జీ. వోలు ఉపాధ్యాయులు ప్రభుత్వ వైఖరికి అసమ్మతిగా నిరసన దినం జరుపవలసిందని ప్రదేశ్ ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సంఘంవారు నేడు ఒక ప్రకటన చేశారు.

హైద్రాబాద్ నగరంలోను, అన్ని జిల్లా తాలూకా కేంద్రాల్లోను ఏప్రిల్ 16వ తేదీన నిరసన సభలు జరపడానికి సన్నాహాలు జరుపు తున్నారు.

ప్రదేశ్ ఎన్. జి. వో ల సంఘ కార్యదర్శి శ్రీ శ్రీరాములుగారిని, ఉపాధ్యాయుల సంఘాధ్యక్షులు శ్రీ రాఘవాచారిగారిని ప్రభుత్వం హైద్రాబాద్ నుండి బదిలీ చేసిన విషయం పాఠకులకువిదితమే. వీరి బదిలీలను నిలిపివేయవలసినదిగా ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినప్పటికీ ప్రభుత్వ వినిపించుకోలేదు. ఇంకా కొంతమందిపై కూడా ప్రభుత్వం ఇటువంటి శిక్షణచర్యలను తీసుకొంది.

అందుచేత ఇప్పుడైనా ప్రభుత్వం ఈ బదిలీలన్నింటిని రద్దుచేసి యితరులపై తలపెట్టిన శిక్షణచర్యను, నిర్బంధాలను అపుచేయవలసిందిగా సంయుక్తకార్యాచరణ సంఘం కోరుతోంది. ప్రస్తుతం ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య నెలకొన్న సద్భావ వాతావరణాన్ని ఈ విధంగాచెడగొట్టవద్దనీ, కేంద్రప్రభుత్వం తన ఉద్యోగుల సంఘనాయకులకిస్తున్న సౌకర్యాల కిది విరుద్ధంగా ఉందని తెలియజేసింది.

ప్రభుత్వ ఉత్తర్వులు ఉద్యోగులలో చాలా భయాందోళనను కలిగిస్తోందని అందువలన ప్రస్తుత పరిస్థితులు చెడ వచ్చునని హెచ్చరించింది. (వి. వి.)

ఉక్కు గొట్టాల ఉత్పత్తిలో రష్యా ముందంజ

మాస్కో, ఏప్రిల్ 11

ఉక్కుగొట్టాల నిర్మాణంలో సోవియట్ యూనియన్ అమెరికాను అధిగమించిందని 'ప్రవదా' పత్రిక నేడు ప్రకటించింది.

అమెరికాలో సంవత్సరానికి ఒక్కొక్క మిల్లు సరాసరి 45 వేలు టన్నుల గొట్టాలు తయారుచేస్తుంది. సోవియట్ యూనియన్‌లోఒక్కొక్క మిల్లు 62 వేల టన్నుల గొట్టాలు తయారుచేస్తున్నది.

సప్తవర్ష ప్రణాళిక అమలుజరిగే కాలంలో (59-65) సోవియట్ యూనియన్‌లోని ఒక్కొక్క మిల్లు ఏడాదికి 2 లక్షల టన్నుల గొట్టాలు తయారుచేయగలదని ప్రవదా వెల్లడించింది.

ఏడాదికి 3 లక్షల టన్నుల బరువు గల, అతుకులేని గొట్టాలను సైతం తయారుచేయగల మిల్లులను నిర్మించడానికి సోవియట్ ఇంజనీయర్లు సన్నాహాలు చేస్తున్నారు. గొట్టాల తయారుచేసేయంత్రాలు పూర్వం రష్యలో లేవు. అక్టోబరు విప్లవం తరువాతనే ఇవి స్థాపించబడినాయి. ఈపరిశ్రమలో అమెరికా తరువాత స్థానం రష్యాదే.

ఆఫ్రికాలో జాతి విచక్షణలేని ప్రజాస్వామ్యం అవసరం

అన్ని జాతులవారుగల ఆఫ్రికా లిబరల్ పార్టీ ప్రకటన

కేప్‌టౌన్, ఏప్రిల్ 13

దక్షిణాఫ్రికాలో శ్వేతజాతులవారు, రంగుజాతులవారిపట్ల ప్రదర్శిస్తున్న నిరంకుశ వైఖరిని లిబరల్ పార్టీ నేడు ఖండించింది. జాతి విచక్షణలేని ప్రజాస్వామ్యస్థాపనకై తమ పార్టీ దీక్ష వహిస్తున్నదని ఉద్ఘాటించింది. లిబరల్ పార్టీలో అన్ని జాతులవారున్నారు.

గత సంవత్సరం అక్రాలో జరిగిన ఆఫ్రికా మహాసభ ప్రథమవార్షికోత్సవ సందర్భంలో లిబరల్ పార్టీ ఆధ్వర్యాన ఇక్కడ జరిగిన బహిరంగ సభలో పై విధంగా తీర్మానించారు.

సభలో 5 వందలమందికి పైగా పాల్గొన్నారు.

ఘనా ప్రధానమంత్రి డా. న్క్రూమా సభకు పంపిన సందేశంలో ఇలా పేర్కొన్నారు:

"అన్ని జాతులు సమానమనే విధానాన్ని బహిరంగంగా బలపరచేధైర్యం గల దక్షిణాఫ్రికా శ్వేతజాతీయులకు నా అభినందనలు."

ఇరాక్‌పై ఈజిప్ట్ మంత్రి అభాండాలు

కైరో, ఏప్రిల్ 13

ఇరాక్‌లో కమ్యూనిస్టుల జోక్యం, గత జూలైలో లెబనాన్, జోర్డాన్‌లలో ఆంగ్లో-అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం వంటిదేనని ఈజిప్టు మంత్రి కమల్ రిఫాత్ నేడు ఆరోపించారు. ఇరాక్‌లోని పరిస్థితి ఐక్య అరబ్ రిపబ్లిక్‌కు ప్రమాదకరంగా పరిణమిస్తే ఇరాక్‌పై తాము తీవ్ర చర్య తీసుకొంటామని హెచ్చరించారు.

బ్రిటిష్ ఫ్రెంచి ప్రధాన మంత్రుల ఏకీభావం

లండన్, ఏప్రిల్ 13

బ్రిటిష్ ఫ్రెంచి ప్రధాన మంత్రులైన హెరాల్డ్ మాక్మిలన్, మైకేల్ డిబ్రేల మధ్య ప్రధాన విషయాలలో ఏకీభావం కుదిరిందని నేడు అధికార వర్గాలు వెల్లడించారు.

ఉభయదేశాల ప్రధానులు జర్మనీ, బెర్లిన్, యూరపుభద్రత మొదలగు సమస్యలపై నేడు రెండుంబావుగంటల పాటు చర్చించారు. ఉభయుల మధ్య విధానాలకు సంబంధించినంతవరకూ ఏకీభావం ఏర్పడిందనీ, ఉభయుల దృక్పథాలకు నిర్దిష్టమయిన రూపు మిక్కిలి కలసివుందని బ్రిటిష్ అధికారవర్గాలు తెలియజేశాయి.

ప్రధానులిద్దరూ యూరోపు ప్రాంతంలో సైన్యాల ఆయుధాల తగ్గించే సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను చర్చించారని వీరు తెలియజేశారు. కాని సంభాషణ వివరాలు తెలియజేయడానికి వీరు నిరాకరించారు.

బ్రిటన్‌కు పశ్చిమజర్మనీకి మధ్య రాజీ కుదర్చడానికి తాను సిద్ధంగా వున్నానని ఫ్రాన్సు చెప్పిందా అని ఒక విలేఖరి అడుగగా, అంతకన్నా అవివేకమయిన ప్రశ్న మరొకటి లేదని ఫ్రాన్సు ప్రభుత్వ ప్రతినిధి ఒకరన్నారు.

మధ్యప్రాచ్య సమస్యపై ప్రధానులిద్దరు రేపు చర్చించవచ్చునని తెలుస్తోంది.

ప్రధానమంత్రులు జరుపుతున్న చర్చలలో ఉభయదేశాల విదేశాంగ మంత్రులుకూడ పాల్గొంటున్నారు.

రేడియో

గురువారం, ఏప్రిల్ 16

విజయవాడ

ఉదయం: 6-30 శుభోదయం; 6-35 వాద్యసంగీతం; 6-40 భక్తిరంజని; 7-0 తె. వార్తలు; 7-15 డి. డి. నాగయ్య: నాదస్వరం; 7-45 సంగీతశిక్షణ; మధ్యాహ్నం. 12-30 చౌ చౌ నుండి: కొన్ని ఘట్టాలు, వినోద కార్యక్రమము; 1-0 కార్మికులకు - (హై. నుండి రిలే); 1-30 గణపతి - హాస్యనాటిక (4వ భాగం); 1-45 విరామసంగీతం; 1-50 తె. వార్తలు; సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాంతీయవార్తలు, 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు; 7-40 విరామ సంగీతం; 7-45 రాగం, తానం, పల్లవి; 8-40 డి. డి. నాగయ్య: నాదస్వరం; 9-15 పంచవర్ష ప్రణాళికా గీతాలు; 9-30 అఖిల భారత నాటక కార్యక్రమం; 10-40 సమాప్తి.

హైద్రాబాద్-బి

ఉదయం: 6-30 సుప్రభాత్; మధ్యాహ్నం: 12-30 ఎన్. వెంకటరామన్; 1-0 కార్మికులకు; 2-10 శాస్త్రీయ సంగీతం, సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 9-15 పంచవర్ష ప్రణాళికా గీతాలు (విజయవాడనుండి రిలే), 9-30 అఖిల భారత నాటక కార్యక్రమం; 10-40 సమాప్తి.

మహిళల సంక్షేమ సహకార సంఘం
(అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ)
విజయవాడ - 2.
డిస్ట్రిబ్యూటర్లు కావలెను

మా ఫ్యాక్టరీయందు తయారుచేయబడు సమాజ్ కల్యాణ్ అగ్గిపెట్టెలను విక్రయించుటకు సోల్ డిస్ట్రిబ్యూటర్లుగా యున్న "సమాజ్ కల్యాణ్ కాన్సెర్న్" వారి ఏజన్సీని ది 14-4-59 తేదీతో రద్దుపరచడమైనది.

ఇకనుండి సమాజ్ కల్యాణ్ అగ్గిపెట్టెలను అమ్ముటకు, వ్యాపారనిపుణత గలిగి ధరావత్తు కట్టగలిగిన సమర్థులైన వారు మాత్రము ఏజన్సీకొరకై దరఖాస్తులు పంపుకోనవచ్చును.

వివరములకు:
సెక్రటరీ మరియు అసిస్టెంటు డైరెక్టరు ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్సు,
విజయవాడ-2.



ఓటర్లను చేర్పించేగడువు

బందరు, ఏప్రిల్ 11

కృష్ణాజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ మైనేని లక్ష్మణస్వామిగారు ఓటర్లను చేర్పించు విషయమై క్రింది ప్రకటన చేస్తున్నారు:

కృష్ణాజిల్లాలో ఓటర్ల లిస్టులో చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సమాచారం ఏప్రిల్ 20వ తేదీలోపల గ్రామశాఖా కార్యదర్శులు తాలూకా కమ్యూనిస్టు సమితుల ద్వారా తాలూకా తహశీల్ దారులకు అందజేయ్యాలి. పేర్లు, ఎడ్రసులు యిస్తే చాలును.

1959 మార్చి 1వ తేదీకి 21 సంవత్సరములు పూర్తి అయిన వారందరూ ఓటర్లుగా చేరడానికి అర్హులు

లోగడ ఒక గ్రామంలోగాని, వార్డులోగాని ఇల్లు ఉంటేనే ఓటరుగా చేరే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు యిల్లు ఉన్నా, నివాసం లేకపోతే ఓటు అర్హత ఉండదు. సాధారణంగా ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఓటరుగా చేరవచ్చును. ఇది జిల్లా కంతటికీ వర్తిస్తుంది.

నందిగామ, దివి, గన్నవరం, ఉయ్యూరు నియోజకవర్గాలలో మాత్రం ఈ సమాచారం మేనెల 15వ తేదీవరకు యివ్వవచ్చును.

గ్రామశాఖా కార్యదర్శులు, తాలూకా సమితి కార్యదర్శులు త్వరపడి తమ ప్రాంత సమాచారం తహశీల్ దారులకు అందజేయాలి.

హరిజనుల ఇండ్లస్థలాలకు పట్టాలివ్వాలి

జమ్ములపాలెం, ఏప్రిల్ 10

నెల్లూరుజిల్లా కావలి తాలూకా జమ్ములపాలెం గ్రామ కమ్యూనిస్టుపార్టీ కమిటీ ఏప్రిల్ 6వ శ్రీ పి. పెంచలయ్యగారి అధ్యక్షతను సమావేశమయింది. బీదప్రజలకు ఇండ్ల స్థలాలు, సాగుచేసుకుంటున్న బంజర్లు, శివాయి బంజర్లకు వెంటనే పట్టాలు ఇవ్వవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

బజారు ధరలు

విజయవాడ, ఏప్రిల్ 14

[మధ్యాహ్నం గం|| 1 వరకు]

బంగారం ధరలు

మేలిమి: పొట్లు		121 8 0
నాను		121 0 0
సవరను		79 0 0
వెండి: 100 తులములు		202 0 0
తులము		2 1 0

ధాన్యం ధరలు

24 సెంబరు		రు 29 0 0
వంకసన్నాలు		26 8 0
12 సెంబరు		26 0 0
అక్కుళ్ళు		24 8 0
కుసుమ		24 8 0

బియ్యం ధరలు

24 సెంబరు		రు. 68 0 0
వంకసన్నాలు		64 0 0
12 సెంబరు		60 0 0
అక్కుళ్లు		58 8 0
కుసుమ		58 0 0

అపరాల ధరలు

మినుములు 240 శే		57 0 0
కందులు		56 0 0
నల్లపెసలు		61 0 0
పచ్చ పెసలు 280		67 0 0
పచ్చ పెసలు (మెట్టవి)		64 0 0
సెనగలు దేశవాళి		55 0 0
,, (పంజాబ్)		50 0 0
ధనియాలు 26కుంచాలు 45/		52 0 0
ఉలవలు		40 0 0
ఆముదాలు		42 0 0
పంచదార (వుయ్యూరు)		111 8 0
కొబ్బరినూనె డబ్బా		37 0 0
వెల్లుల్లి మణుగు		9 4 0
బెల్లం మణుగు	5-0-0	8 8 0
మిర్చి ,,	16-0-0	22 0 0
నీరుల్లి ,,	1-10-0	2 2 0
చింతపండు ,,	6-12-0	12 8 0
నువ్వులనూనె ,,		85 8 0
వేరుశనగపప్పు 177 శే		
జగ్గయ్యపేట		65 8 0
కోదాడ		67 0 0
నూనె మణుగు		18 15 0
కేక్ 160 శేరులు		21 12 0
కొబ్బరికాయలు 1000		
	210-0-0	237-0-0
సంచులు 100		93 4 0
డిటో ఫార్వర్డు		86 0 0
తవుడు		11 8 0
		12 8 0



ఆంధ్రుల పోరాటమే మహారాష్ట్రులకు ఆదర్శం

శ్రీ నల్లా నరసింహులు సన్మానసభలో బొంబాయి కమ్యూనిస్టు నాయకుడు శ్రీ కుర్నే ప్రసంగం

బొంబాయి, ఏప్రిల్ 10

తెలుగుప్రజలు కేంద్రప్రభుత్వాన్ని లొంగదీసి విశాలాంధ్రను సాధించుకొన్నట్లు, మహారాష్ట్ర ప్రజలు బొంబాయితో కూడిన సంయుక్త మహారాష్ట్రను అనతికాలంలోనే సాధించుకోగలరని, బొంబాయి కమ్యూనిస్టునాయకుడు శ్రీ కుర్నే, తెలంగాణా వీరయోధుడు శ్రీ నల్లా నరసింహులు సన్మానసభలో చెప్పారు.

బొంబాయి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే, శాసన సభ్యురాలు శ్రీమతి తరుణా చాధరీల నాయకత్వాన 300 మంది కార్మికులు ఏప్రిల్ 4వ తేదీన దాదర్ స్టేషన్‌లో శ్రీ నల్లా నరసింహులుగారికి పూలమాలలతో స్వాగతమిచ్చారు.

శ్రీ నరసింహులు బొంబాయి కమ్యూనిస్టుపార్టీ మహాసభలో ప్రత్యేకాహ్వానితులుగా పాల్గొని తన పోరాటానుభవాలను, ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులను వివరించారు.

వర్లీ, ఆంధ్ర జనసంఘం తరఫున ఏప్రిల్ 9వ తేదీ శ్రీ నల్లానర్సింహులు సన్మానసభ ఏర్పాటు చేయబడింది. ఈ సభలో 3000 మంది ప్రజలు పాల్గొన్నారు.

సభకు బొంబాయి ఆంధ్రజన సంఘాధ్యక్షులు శ్రీ మట్టపల్లి చంద్రయ్యగారు అధ్యక్షత వహించారు.

తెలంగాణా ఉరిశిక్షల కేసులలో పనిచేసిన శ్రీ డేనియల్ లతీఫ్ (బారిస్టర్) శ్రీ గణేశ్ (అడ్వొకేటు) శ్రీమతి డేనియల్ లతీఫ్ గార్లు (డిఫెన్సు కమిటీ సెక్రటరీ) ఈసభలో పాల్గొన్నారు. ఉరికంబాలకు ఎక్కించబడే అనేకమంది తెలంగాణాయోధుల ప్రాణాలను కాపాడటానికి శ్రీలతీఫ్, శ్రీ గణేశ్ గారలు చేసిన కృషిని, సేవను శ్రీ నర్సింహులుగారు ఉగ్గడిస్తూ పూలమాలలువేసి వారిని సన్మానించారు.

శ్రీలతీఫ్ కాంగ్రెసు విధానాలను నిశితంగా విమర్శిస్తూ ఉపన్యసించారు. తెలంగాణాలో విప్లవయోధులు చూపిన ధైర్య సాహసాలు, చేసిన అసమాన త్యాగాలు తమలను ముగ్ధుల్ని చేశాయని తెలంగాణాప్రజల వీరోచిత పోరాటాలే నైజాంను గద్దెదింపటానికి ప్రధాన కారణమైనవని చెప్పారు.

సన్మానసభలో షోలాపురం బేతికార్మిక సంఘాధ్యక్షులు శ్రీ వదూరు వెంకప్ప, బొంబాయి ఆంధ్రజనసంఘం కార్యదర్శి శ్రీ పడిగె నారాయణ గారలు కూడ ఉపన్యసించారు.

శ్రీ జి. ఎల్. రెడ్డి తెలంగాణా పంచాయితీ ఎన్నికల నిధికై విజ్ఞప్తి చేయగా రు 89 లు వసూలైంది.

అబ్కారీ సొమ్ము కాజేసినఉద్యోగులు

ఖమ్మంమెట్టు, ఏప్రిల్ 10

ఖమ్మంజిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ ఆఫీసు హెడ్‌గుమస్తా షేకు హుసేను దాదాపు రు 3,000/- లు ప్రభుత్వ డబ్బు అపహరించాడనే ఆరోపణపై సస్పెండు చేయబడ్డాడు. అతనిపై డిపార్టుమెంటల్ విచారణ జరుగుతున్నది.

తాలూకా తహశీలు (అబ్కారి స్పెషలు) ఆఫీసులో లోగడ పనిచేసి ప్రస్తుతం జిల్లా అబ్కారీ సూపరింటెండెంటు ఆఫీసు (బకాయి సెక్షను)లో పనిచేస్తున్న గులాంమెహిద్దీన్ దాదాపు రు. 800/- ప్రభుత్వడబ్బు కాజేశాడనే విషయమై కూడ డిపార్టుమెంటల్‌గా విచారణ జరుగుతున్నది.

వీరుభయులూ కాజేసిన రు3800 లో ఎక్కువభాగం అబ్కారి బాకీదారులు చెల్లించినది. చెల్లించిన డబ్బు బ్యాంకులో జమ కానందున కంట్రాక్టర్లకువాయిదాలు పడటంలేదు. చెల్లించిన డబ్బు వారి బాకీలక్రింద జమ కట్టలేదు.

చెల్లించిన డబ్బు మరల కట్టమని నోటీసులు పంపించారు. రు. 500 బకాయి వుంటే రు 800 చెల్లించమన్నారు.

జనగామ మునిసిపల్ కార్మికులచే వెట్టి

జనగామ, ఏప్రిల్ 12

జనగామ పురపాలక సంఘ కార్మికులు దాదాపు 25మంది కలరు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా ఇంకా కొంత మంది అవసరం. అయినా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు యింట్లో స్త్రీ, పురుష కార్మికులిద్దరిచే పని చేయించుకుంటున్నారు. అలాగే క్లర్కు ఇంట్లో స్త్రీ, పురుష కార్మికుల నిద్దరిని తమ స్వంతపనులకు వాడుకొంటున్నారు.

కృష్ణాజిల్లా మంతెన బోర్డు హైస్కూలు వార్షికోత్సవాలు ఏప్రిల్ 7న జరిగాయి. నృత్య, నాటిక ప్రదర్శనలు జరిగాయి.

ప్రజాస్వామ్యంలో పంచాయితీల స్థానం

వనం కిష్టాపురం, ఏప్రిల్ 8

స్థానిక పంచాయితీబోర్డు ఎన్నికల సందర్భములో గ్రామ కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన జరిగిన బహిరంగ సభలో తెలంగాణా కమ్యూనిస్టు నాయకుడు శ్రీ నల్లమల ప్రసాద్ గారు "ప్రజాస్వామిక రాజ్యంలో పంచాయితీల పాత్ర" అనే విషయాన్ని చక్కగా విశదీకరించారు. పంచాయితీ బోర్డులు గ్రామాలలో కలతలను కల్గచేస్తున్నవను విమర్శ కొంతవరకు సత్యమే కాని, పూర్తిగా నిజంకాదు. ప్రజలు సామరస్యంలో ఐకమత్యముగా మెలుగుచూ తమకు విశ్వాసమున్న సభ్యులనే యెన్నుకోవాలి. కాని కొట్లాటలు, ఈర్ష్య, అసూయలకు యీ ఎన్నికలలో తావులేదన్నారు.

ప్రజాస్వామ్యపరిపాలనలో గ్రామ పంచాయితీలు పునాదిరాళ్ళు. ఇవి క్రమబద్ధముగా నిజాయితీపరులచేత నిర్వహించబడిననాడే నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొల్పబడగలదు.

కమ్యూనిస్టుపార్టీ గ్రామాలలో సంఘీభావము ఐకమత్యం కొరకు చేయూత నిస్తుందన్నారు. కాబట్టి పంచాయితీబోర్డుకు ప్రజావిశ్వాసమును చూరగొన్న కమ్యూనిస్టు ప్రతినిధులే ఎన్నిక చేయబడగల"రని శ్రీ ప్రసాద్ తమ ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

పొగాకు కూనెతీసే కూలీల తొలగింపు

అధికారి జోక్యంవల్ల తిరిగి పనిలో చేర్చుకొన్న వైనం

పరుచూరు, ఏప్రిల్ 10

కొల్లా వెంకటనారాయణ గారి పుగాకు కంపెనీలో కూనె తీస్తున్న కార్మికులు సుమారు 350 మందిని పని లేదనే సాకుతో ఈ నెల 6వ తేదీన యజమానులు తొలగించారు.

ఈ విషయాన్ని స్థానిక పుగాకు కార్మిక సంఘం అందరికీ పనులు కల్పించాలని జిల్లా లేబరు ఆఫీసరుగారిని కోరింది. వెంటనేవారు జోక్యంకల్గించుకొని తీసివేయబడిన 350 మందికార్మికులను తిరిగి పనిలో పెట్టుకోవాలని తీర్పు యిచ్చారు. పర్యవసానంగా యజమానులు కార్మికులందరినీ పనులలోకి చేర్చుకొన్నారు.

కేరళ ప్రభుత్వ వార్షికోత్సవం

వావిలేటిపాడు, ఏప్రిల్ 12

నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకా వావిలేటిపాడు గ్రామంలో ఏప్రిల్ 5వ తేదీన కేరళ ప్రభుత్వ ద్వితీయ వార్షికోత్సవం జరుపబడింది. ఊరేగింపు చేసి, గ్రామ కమ్యూనిస్టు కార్యాలయం వద్ద ఎర్రజెండా ప్రతిష్ఠించారు.

తరువాత శ్రీ కడియాల రంగయ్యగారి అధ్యక్షతను సభజరిగింది. సభలో గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు శ్రీ వమిడి కోటయ్య గారు కేరళ ప్రభుత్వం చేసిన ప్రజాహిత కార్యాలను వివరించారు. తాలూకా కౌన్సిల్ సభ్యులు అవుల వెంకటనరసింహంగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

తరువాత పిల్లలకు పప్పుబెల్లం పంచబడింది.

లోపభూయిష్ఠమైన మన విద్యావిధానం

'గుంటూరు మండల సర్వస్వాన్ని' ఆవిష్కరిస్తూ ఆచార్య రంగాగారి ప్రసంగం

గుంటూరు, ఏప్రిల్ 10

"ఉద్యోగాలివ్వవలసివస్తుందని పరీక్షల్లో నూటికి డెబ్బదిమందిని తప్పించటానికి ప్రయత్నించే మన విద్యావిధానం లోపభూయిష్ఠమైనది. ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీలాగ నియమితకాలంలో పాఠశాలకు హాజరై చదువుకున్న వారందరికీ సర్టిఫికెట్లు ఇవ్వడం న్యాయం" అని నిన్న యిక్కడ పార్లమెంటు సభ్యులు ఆచార్య రంగాగారు వెల్లడించారు.

శ్రీ దరువూరి వీరయ్యగారు రచించిన "గుంటూరు మండల సర్వస్వం" అనే గ్రంథాన్ని నిన్న సాయంత్రం ఇక్కడ హిందూకళాశాల గ్యాలరీ హాలులో పార్లమెంటు సభ్యులు ఆచార్య రంగాగారు ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ మహోత్సవానికి హిందూ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వల్లభజోస్యుల సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. కవులు, పండితులు, రచయితలు, న్యాయవాదులు, డాక్టర్లు, వివిధ రాజకీయపార్టీల ప్రముఖులు విచ్చేశారు.

శ్రీ జి. వి. పున్నయ్యశాస్త్రిగారు శ్రీ రంగాగారికి, సభికులకు స్వాగతం చెప్పారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ శ్రీ రంగాగారు ఇలా ప్రసంగించారు:

మహారాష్ట్రులు, బెంగాలీలు ఎప్పుడో తమ విజ్ఞాన సర్వస్వాలను ప్రచురించుకొన్నారు. ఆంధ్రులు ఇప్పుడిప్పుడే ప్రచురిస్తున్నారు. కీ. శే. లక్ష్మణరావు పంతులు, నాగేశ్వరరావు పంతులుగార్లు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించాలనే సంకల్పంతో కృషి చేశారు. ప్రతి జాతికి తమ చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, భౌగోళిక, కళా, సంస్కృతులను గురించిన విజ్ఞాన సర్వస్వాలుండటం అవసరమని ఆ పెద్దలు గుర్తించారు. అందుకై కృషిచేశారు. ఈ మహత్తర కృషికి ప్రభుత్వమో, ప్రజాసంస్థలో పూనిక చూపాలి. ఇది వ్యక్తులకు సాధ్యమయ్యే పనికాదు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సహాయంతో కృషిచేస్తున్న ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ప్రచురణ సంస్థవారు సైతం ఐదేళ్ళ తర్వాత మూడుభాగాలను మాత్రమే వెలువరించగలిగారు.

రాష్ట్రానికే ఒక సమగ్రమైన, సంపూర్ణమైన, విజ్ఞాన సర్వస్వం సంపూర్తి కానప్పుడు జిల్లా స్థాయిలో విజ్ఞాన సర్వస్వాన్ని గురించి ఆలోచించవలసిన పనిలేదు. అయితే శ్రీ దరువూరి వీరయ్యగారు అట్టి కృషి చేయుటం గర్వించదగిన విషయం. ఆయన ఒక్క సంవత్సరం ఏకబిగిన కృషిచేసి సర్వాంగ సుందరంగా 500 పేజీల గ్రంథాన్ని మనముందుంచారు.

ఈనాడు చదువుకొన్న వారిలో "తాము మినహా మిగతా వారంతా ఎందుకూ కొరగానివారని" ఒకవాదం వ్యాపించింది. ఇది చాలా తప్పు. డిగ్రీలుంటేనే చదువుకొన్న వారనే అభిప్రాయంకూడా సరికాదు. డిగ్రీ చదువులు ఉద్యోగాలకు పనికి రావచ్చు. ప్రాపంచిక వ్యవహార జ్ఞానం సంపాదించి, కృషిచేయటానికి డిగ్రీ చదువులు ప్రాతిపదిక కారాదు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఒక సత్సంప్రదాయమున్నది. నాలుగేళ్ళో, మూడేళ్ళో నియమిత కాలంలో పాఠశాలకు హాజరై చదువుకున్న వారికి పరీక్షలో ఉత్తీర్ణులైనా కాకపోయినా అక్కడ సర్టిఫికెట్ ఇస్తారు. అలాంటి సంప్రదాయాన్ని మన దేశంలో కూడా నెలకొల్పాలని నా సలహా. ఉద్యోగాలివ్వవలసి వస్తుందని పరీక్షల్లో నూటికి డెబ్బది మందిని తప్పించడానికి ప్రయత్నించే మన విద్యావిధానం లోపభూయిష్ఠమైనది. నియమితకాలంలో పాఠశాలకు హాజరై చదువుకున్న వారందరికీ సర్టిఫికెట్లు యిచ్చి పంపడం న్యాయం. ఉద్యోగాలకొరకు అవసరమనుకొంటే వేరొక పరీక్ష పెట్టుకోమనండి. ఇప్పుడలాంటి విధానం కొన్ని విషయాలలో వుండనేఉందికూడా.

విద్యవలన వినయం అన్నారు పెద్దలు. విద్య అనగానే కాలేజి చదువులే కాదు. విద్యకు డిగ్రీలే వుండక్కరలేదు. రచనలో నోబుల్ బహుమానం పొందిన విన్‌స్టన్ చర్చిల్‌కు డిగ్రీలు లేవన్న విషయం జ్ఞాపకం పెట్టుకోండి. అలానే మన ఋషీశ్వరులున్నూ. తదేక దీక్షతో అనుక్షణం చదువులు సాగిస్తూ వారు పండితులు, మహా పండితులు అయినారు.

కనుక రోజూ బడికిపోయి ఉదయం సాయంత్రం వైదీలాగా చదివేచదువులే చదువులుకాదు. విరామకాలంలో మంచి మంచి గ్రంథాలను చదవడం కూడా చదువేనన్న విషయం మనం మనస్సులో వుంచుకోవాలి" అని ఆచార్య రంగాగారన్నారు.

తర్వాత అధ్యక్షులు శ్రీవల్లభజోస్యుల సుబ్బారావుగారు మాట్లాడుతూ విద్యావిధానం గురించి శ్రీ రంగాగారు వెల్లడించిన అభిప్రాయాలతో తాను ఏకీభవిస్తున్నానన్నారు. "మండలసర్వస్వం" ప్రచురించటంలో శ్రీ వీరయ్యగారు ప్రశంసార్హమైన కృషిచేశారన్నారు.

శ్రీ దరువూరి వీరయ్యగారు గ్రంథ ప్రచురణలో తానుచేసిన కృషిని నివేదించారు.

శ్రీ బాచిన సుబ్బారావు గారు వందన సమర్పణ గావించారు.

శ్రీమతి త్రిపురనేని సాధువమ్మగారు రచయితకు రు 116-0-0 బహూకరించారు.

లేఖలు

రాయనపాడులో రైళ్లు ఆపాలి

మహాశయా,

సెంట్రల్ రైల్వే లైనులోగల రాయనపాడు స్టేషనులో రైళ్ళు ఆగక పోవడంవల్ల, రాయనపాడు, పైనూరు పాడు, గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాల ప్రజలు చాలా బాధలుపడవలసివస్తోంది.

హైదరాబాద్‌లో రాత్రి 9-5 గంటలకు బయలుదేరు పూరీ ప్యాసింజరు రాయనపాడుకు ఉదయం 7-20 గంటలకు చేరుతోంది. ఈ బండి రాయనపాడులో ఆగితే ఉదయం కోర్టు, రోజువారీ వ్యాపార పనులకు వెళ్ళవలసిన ప్రయాణీకులు సకాలానికి విజయవాడ చేరుకుంటారు.

అలాగే పూరీనుంచి హైదరాబాద్ వెళ్ళే ప్యాసింజరు బండి కూడా రాయనపాడు స్టేషన్‌లో ఆగితే ఉదయం 7-30 లేక 8 గంటలకు బయలుదేరి కోర్టు, వ్యాపారపనులకు విజయవాడ వెళ్ళిన పైనాలుగు గ్రామాల ప్రయాణీకులు పగల్లా తమ తమ పనులు చూసుకొని రాత్రికి తమ తమ గ్రామాలకు చేరుకుంటారు.

కావున హైద్రాబాద్‌నుంచి పూరీ వెళ్ళే ప్యాసింజరు, అలాగే పూరీనుంచి హైదరాబాద్ వెళ్ళే ప్యాసింజరు ఈ రెండు బండ్లు రాయనపాడు స్టేషన్‌లో ఆగే యేర్పాటుచేసి పైనాలుగు గ్రామాల ప్రయాణీకులకు ప్రయాణ సౌకర్యం కలుగజేయవలెనని రైల్వే అధికారులను కోరుతున్నాను.

బొడుదురాజు అచ్చిరాజు,
రాయనపాడు.

పత్తికొండ తాలూకాలో శిస్తు రెమిషన్ ఇవ్వాలి

పత్తికొండ, ఏప్రిల్ 13

కర్నూలుజిల్లా పత్తికొండతాలూకా కమ్యూనిస్టుకమిటీ సభ్యుడు శ్రీ సి. రామయ్యగారు ఇలా ప్రకటిస్తున్నారు:

"కర్నూలు జిల్లా పత్తికొండ తాలూకాలో ఈ యేడు ధాన్యపు పంటగాని, వాణిజ్య పంటలు గాని బొత్తిగా పండలేదు. ఇప్పటి కప్పుడే రైతులు రేపు ఎట్లా అని చింతిస్తున్నారు. కాస్తో కూస్తో పండిన ధాన్యం నీరుడు మాగుడు సరిపోగా, ఆయకట్టు (వల్లె, కమ్మర, చాకలి, మంగలి) కార్మికులకు కూడా అప్పుపడిన సంఘటనలు లేకపోలేదు.

మామూలు పనులు దొరికే కాలంలోనే యీయేడు పంటలు సరిగా పండనందున కూలీలు కడుపు చేతబట్టుకొని వలసపోవడానికి మార్గం వెదుకుతున్నారు. చేద్దామంటే పనిలేక తిండికి కటకటపడుతున్నారు.

ఈ విషయమై కర్నూలు జిల్లా కమ్యూనిస్టుపార్టీ ఆందోళన చేసింది. ఇతర జిల్లాలతోపాటు కర్నూలుజిల్లాకు కూడా శిస్తురెమిషన్, ప్రభుత్వ అప్పులు ఇవ్వటం గురించి కలెక్టరువద్దనుండి రిపోర్టురానందున పూరుకున్నామని శాసనసభలో మంత్రిగారు చెప్పారు. కూడా. అంచేత జిల్లా కలెక్టరుగారు దీనివిషయంలో తగుశ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అంతకుముందే తాలూకాలోని ఇబ్బందులను గురించి అన్ని గ్రామాల నుండి మహజర్లు కలెక్టరు పి. ఏ. గారికి ఇచ్చాము. తగు చర్య తీసుకుకోలా చూస్తామన్నారు.

పై వివరించిన రైతుల ఇక్కట్లను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం వెంటనే యీ క్రింది పనులు చేయాలని కోరుతున్నాను.

శిస్తురెమిషన్ యివ్వాలి, చౌకడిపోలద్వారా రైతులకు గింజలు సరఫరా చేయాలి. వ్యవసాయ కూలీలకు రోడ్డు వగైరా పనులు, కల్పించాలి. రైతులకు ప్రభుత్వం అప్పులు మంజూరు చెయ్యాలి."

ఏలూరు ప్రాథమిక పాఠశాలలు

ఏలూరు, ఏప్రిల్ 11

ఏలూరులో కొన్ని ప్రైవేటు పాఠశాలల మేనేజర్లు తాము దేశభక్తులమనీ, స్వాతంత్ర్య పోరాటంలో త్యాగం చేశామని చెప్పుకుంటారు. కాని వారి స్వాధీనంలో ఉండే ప్రాథమిక పాఠశాలలనుమాత్రం ప్రభుత్వపరం చేయకుండా వుంటున్నారు. సరస్వతి, పరశురామ, కస్తూరి, పాండురంగ, పొట్టి శ్రీరాముల పాఠశాలలు యింకా ప్రభుత్వ స్వాధీనం చేయబడలేదు. నవయుగ పాఠశాల మానేజరుమాత్రం అంగీకరించారు.

శబరిఫెర్రీ అక్రమ వసూలు

కూనవరం శబరి ఫెర్రీ యిదివరలో అర్ధణా వుండేది. 1956 సంవత్సరంలో ప్రభుత్వంవారు ఆ రేటును 0-2-0 కు పెంచారు. దానిమీద చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు ప్రభుత్వంవారికి, మహజర్లు, టెలిగ్రాములద్వారా యిదివరలో వున్న రేటుకు తగ్గించవలసిందిగా ఆందోళన చేశారు.

దానిపై ప్రభుత్వం రేటును 5 నయాపైసలకు తగ్గించినది. కాని యీ సంవత్సరం పాడిన కంట్రాక్టరు, వైవిధముగా వసూలుచేయక 0-1-0 యిచ్చిన వారికి 1 నయాపైసా తిరిగి యిచ్చుట లేదు. ఎవరైనా అడిగితే మా వద్ద నయాపైసలులేవు, మార్చుకొని రండి అని చెప్పుచున్నారు.

అంతే కాకుండా రాజమండ్రి నుండి బస్సుమీద వచ్చే ప్రయాణీకుల వద్ద 0-2-0 వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు దిగువనుండి వచ్చిన పత్తేటి వీరభద్రంగారి వద్ద 0-2-0 లు తీసుకున్నారు. భద్రంగారు 0-1-0 యిస్తే అణాకాదు బేడఅని దౌర్జన్యంగా వసూలు చేశారు.

కావున ప్రభుత్వంవారు యీ అన్యాయాన్ని అరికట్టి ప్రజలకు మేలు చేస్తారని ఆశిస్తున్నాను.

పుష్ప సూర్యనారాయణ,
కూనవరం.

అమ్మోనియా సల్ఫేటు సప్లయి చేయాలి

కంభం చెరువుక్రింద చెఱుకు, అరటి, ఆకుతోటలు వున్నవి. కంభం స్టోరులో ప్రస్తుతం అమ్మోనియా సల్ఫేట్ ఒక్క సంచియైనను లేదు. ఈ మధ్యమాగాణి కలుపులకుగాను గ్రామస్థులు సేరు 1-8-0 వంతున బ్లాకుమార్కెట్టులో కొన్నారు. పోయినసెలలో జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసరుగారితో, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసరుగారితో మాట్లాడగావారు స్టాకు లేదని జవాబు యిచ్చారు. ప్రస్తుతం మాకు అమ్మోనియా సల్ఫేటు చాల అవసరం. 300 టన్నుల అమ్మోనియా సల్ఫేట్, 100 టన్నులు యూరియా, 100 టన్నులు సూపర్ ఫాస్ఫేట్, అవసరమని విజ్ఞప్తి చేస్తున్నాను.

గడ్డె రామయ్య, కంభం తాలూకా
రైతుసంఘం అధ్యక్షుడు.

ట్రైనింగ్ విద్యార్థులకు స్టయిఫండు

ప్రభుత్వంలో ధనం అనేక విధముగా దుర్వినియోగ మవుచున్నది. ట్రైనింగు స్కూలులో చదువు ప్రతి ఉపాధ్యాయ విద్యార్థికి రు. 18-0-0 లు స్టయిఫండు సౌకర్యము కలిగించెడువారు. కాని మన ప్రభుత్వం దానినిప్పుడు రద్దుజేసినది. వెనుకబడిన తరగతుల కులములవారికి మాత్రమే యిప్పుడిచ్చుచున్నారు. సెకండరీ ట్రైనింగ్ కోర్సు చదువుటయే మిక్కిలి కష్టము. అందులో స్టయిఫండు సౌకర్యం లేకపోవుట వలన నేటి ఉపాధ్యాయ విద్యార్థులు మిక్కిలి కష్టములో దుస్తరమగు జీవితమును అనుభవించుచున్నారు. అందువలన అనేకబోధనాభ్యాసనా పాఠశాలలందు చాలా ఖాళీలున్నవి. అన్ని శాఖలలోనూ శిక్షణా కాలమందు స్టయిఫండు సౌకర్యమును కలిగించిరి. ఒక్క సంవత్సరము కోర్సుకును, బేసిక్ ట్రైనింగ్ కోర్సుకును స్టయిఫండు యిచ్చుచున్నారు గాని రెండు సంవత్సరముల సెకండరీ ట్రైనింగ్ కోర్సుకు మాత్రమే స్టయిఫండు యిచ్చుటలేదు. ఉపాధ్యాయుల యెడ ప్రభుత్వం సంకుచితతత్వం, పక్షపాతం వహించుచున్నది. మన పొరుగురాష్ట్రమగు కేరళయందు నెలకు 50 రూపాయలు స్టయిఫండు యిచ్చుచుండగా మన ప్రభుత్వం ఉపాధ్యాయశిక్షణాకాలమందు 18 రూపాయలు యివ్వలేక పోవుచున్నారు. ఇది ఎంతయేని శోచనీయము. కనీసము పొట్టగడవని ఉపాధ్యాయ విద్యార్థులు ఏ విధముగ ట్రైనింగుకోర్సు పూర్తిచేయగలరు? ఉపాధ్యాయులు దేశమునకు వెన్నెముక వంటివారుకదా? ఈ కొద్ది స్టయిఫండును కలుగజేయుట ప్రభుత్వమునకు ఏమాత్రము కష్టమయినది కాదు. డబ్బులేదని చెప్పు మంత్రి పుంగవులకు ప్రతినెల రు 1500 జీతము లెట్లు వచ్చుచున్నవి? స్టయిఫండు సౌకర్యము వెంటనే కలుగచేయుదురని నమ్ముచున్నాను.

చింతలపాటి ఆంజనేయులు,
సెకండరీగ్రేడు, పిఠాపురం.

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా యలమర్రు పంచాయితీకి కావలసిన యీదిగువ కనబరచిన వస్తువులను సప్లయి చేయుటకు గాను ది 25-4-59 వ తేదీ సాయంత్రము 3 గం|| లకు సీలువేయబడిన టెండర్లు యీదిగువ సరుకును చేసినవారిచేగాని లేక వారిచే అనుమతి పొందినవారిచేగాని కోరబడుచున్నవి. టెండరు షరతులు తదితర వివరములు ఆఫీసుపని చేయు కాలములో పొందవచ్చును. ఆదేరోజు సాయంత్రము 4 గంటలకు యీ పంచాయితీ కార్యాలయమున వచ్చిన టెండర్లు బహిరంగముగా తెలియజేయబడును.

1. రాతి కోస్టరులు 4'×3' సంఖ్య 1. చెల్లించవలసిన ధరావతు రు 10/-
2. సిమెంటు దస్తుబిన్నులు 4'×3' సంఖ్య 10. చెల్లించవలసిన ధరావతు రు 10/-
3. 1959-60 వ సంవత్సరమునకు ఊడ్చిన చెత్తను కంపోస్టు స్థలమునకు తోలుటకు మనిషిని సప్లయి చేయుటకు. రు 50/
4. ఈ పంచాయితీకి కావలసిన వ్యవసాయపు పనిముట్లు, టస్కార్లు ట్రేయర్లు,12 సెట్లుసప్లయి చేయుటకు, చెల్లించవలసినధరావతు రు 25/-

కార్యనిర్వాహక అధికారి,
యలమర్రు, 11-4-59.

ఇదిగో JVM వారి
చాల-కాలము మన్నే
'ఇనామ్‌దార్'
రంగు | పాప్లినులు
వివిధ రంగులవి దొరకుతున్నాయి మరియు వాటి రంగులు వెలిసిపోవు.

సెల్వేజీ మీద 'సాన్ఫొరైజడ్'
ఈ గుర్తు ఉన్నదా అని గమనించండి

మగవారి, స్త్రీలు మరియు పిల్లల దుస్తులకు యీ పాప్లినులు ఎంతో బాగుంటాయి.

ఈ పాప్లినులు అధికారము పొందిన యీ క్రింది డిస్ట్రిబ్యూటర్లవద్ద మిల్లు ధరలకు లభిస్తున్నాయి:

మెస్సర్స్. ఛగన్‌లాల్ లక్ష్మీచంద్ పారి
మస్కటి మార్కెట్, అహ్మదాబాదు
మెస్సర్స్. మనూభాయ్ కాంతిలాల్ అండ్ కంపెనీ
మస్కటి మార్కెట్, అహ్మదాబాదు
మెస్సర్స్. చునిలాల్ చందన్‌మల్
రంగ్‌వాలా మార్కెట్, అహ్మదాబాదు
మెస్సర్స్. ధనిరామ్ డుంగర్‌మల్
హరిదాస్ మార్కెట్, కపాడియా బజార్, అహ్మదాబాదు
మెస్సర్స్. అజిత్‌భాయ్ రతన్‌చంద్
మస్కటి మార్కెట్‌కు ఎదురుగా, అహ్మదాబాదు

జెహంగీర్ వకీల్ మిల్
అహ్మదాబాదు

EVEREST JVM 193 TG

భిన్న జీవన విధానాల మధ్య సౌమనస్యం

నేడెంతో అవసరమని ప్రధాని నెహ్రూ ఉద్బోధ

హరిద్వార్, ఏప్రిల్ 13

"ఒకరి జీవన విధానాన్ని మరొకరు గౌరవించుకోవడం, తద్వారా స్నేహ సౌభ్రాతృత్వ వాతావరణాన్ని కల్పించుకోవడం దేశాభివృద్ధికెంతో అవసరం. ఈ లక్షణాలను ప్రజలు అలవర్చుకోవాల"ని ప్రధాని నెహ్రూ నేడిక్కడ గురుకుల మహావిద్యాలయంలో స్నాతకోపన్యాసమిస్తూ చెప్పారు.

ఒకరి అభిప్రాయాల్ని మరొకరు ఏవిధంగా గౌరవించుకోవాలో సరిగ్గా అవగతం చేసుకోకపోవడం వల్లనే మన దేశంలోనూ, తదితరచోట్ల అనేక చిక్కులు ఉత్పత్తిల్లుతున్నాయని శ్రీ నెహ్రూ అన్నారు.

భారతదేశానికి మహోన్నత సాంస్కృతిక సంప్రదాయం వుంది. ఇక్కడి ప్రజలకు కూడ అనేక మంచి లక్షణాలున్నాయి. కాని దేశంలో పాతుకుపోయిన కుల, భాషా, మత వైషమ్యాలవల్ల దేశంయొక్క శక్తి ప్రపత్తులూ, దాని హుందాతనమూ కుంటుపడ్డాయన్నారు. మనం యితర దేశాలపట్ల అనుసరిస్తున్న సహజీవన విధానం విజయం పొందిందనే చెప్పాలని శ్రీ నెహ్రూ పేర్కొన్నారు.

సంస్కృత విద్యాలయానికి ప్రారంభోత్సవం

హరిద్వార్‌కు మూడుమైళ్ళ ఉత్తరంగా నున్న సప్తఋష్యాశ్రమంవద్ద సంస్కృత విద్యాలయానికి ప్రధాని నెహ్రూ నేడు ప్రారంభోత్సవం చేశారు.

ఈ విద్యాలయం సంస్కృతం, భారతీయ తత్వశాస్త్రం, తదితర శాస్త్రాలు, వేదాలలో విద్యాబోధ చేస్తుంది. వివిధ విషయాలలో పరిశోధనలు గావించడానికి కూడా ఇక్కడ అవకాశం కల్పించారు.

ఈ సప్తఋష్యాశ్రమంలో ఒక కేంద్ర దేవాలయమూ, మరో తొమ్మిది యితర దేవాలయాలు వున్నాయి. కేంద్ర దేవాలయానికి కుడిపార్శ్వంలో [illegible] వుంది. ఇక్కడ రాష్ట్రపతి శ్రీ రాజేంద్ర ప్రసాద్ వెలిగించిన అగ్నిగుండం నూటొక్క సంవత్సరాలపాటు అలా వెలిగేటట్లు ఏర్పాట్లు చేశారు. ఈ అగ్నిలో ప్రతిరోజూ పదిహేను మంచల కర్రల ఆజ్యంపోస్తూ వుంటారు.

నాగార్జునసాగర్ డామ్ కుడితట్టు ప్రాంతం

ప్రభుత్వ ఉత్తర్వు

హైదరాబాద్, ఏప్రిల్ 13

గుంటూరుజిల్లాలోని నాగార్జున సాగర్ డాము కుడితట్టుప్రాంతం యికమీదట గుంటూరు జిల్లాలో అంతర్భాగంగా వుంటుందని, ఇది నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం తాలూకాలో కలుపబడుతుం[illegible]ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఒక ఉత్తర్వులో తెలిపింది. (వి. వి.)

టెండరు నోటీసు

తేది 27-4-1959 సోమవారం మధ్యాహ్నం గం|| 4-0 ల వరకు కృష్ణాజిల్లా పామర్రు పంచాయితీలో ఈ దిగువ పనులు చేయుటకు సీలువేయబడిన టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే పామర్రుపంచాయితీ ఆఫీసులో తీసికొనబడును. చేరిన టెండర్లు ఆ దినమే సాయంత్రం 4-30 గంటలకు హాజరైన కాంట్రాక్టరుల సమక్షమున తెరువబడును. ఈ ఆఫీసులో రు. 10-0-0లు చెల్లించి యీ పంచాయితీ కంట్రాక్టరుగా రిజిష్టరు పొందనివారి టెండర్లు అంగీకరించబడవు. టెండరుతోపాటు నియమించబడిన ఎర్నస్టు డిపాజిటు చెల్లించవలెను. చేరిన టెండర్లలో కొన్ని, కారణములు తెలుపకయే నిరాకరించుటకు ఈ పంచాయితీకి అధికారము గలదు. ఇతర వివరములు ఈ ఆఫీసు పనిచేయు వేళలలో తెలిసికొనవలెను.

ఎస్టిమేటు నెం. 117 పనియొక్క వివరము: పామర్రు హైస్కూల్ [illegible] వంతెన కట్టుట. ఎస్టిమేటు మొత్తము రు 8,650 టెండరుతోపాటు చెల్లించవలసిన ఎర్నస్టు డిపాజిటు రు 420-

సం. కె. నందీశ్వరరావు

ఎగ్జిక్యూటివు ఆఫీసరు.

పామర్రు పంచాయితీ ఆఫీసు,

11—4—59.

నాగపూర్ తీర్మానాలు

అమలుజరిగి తీరాల్సిందేనని శ్రీ నెహ్రూ

హరిద్వార్, ఏప్రిల్ 13

సహకారవ్యవసాయంపై నాగపూర్ కాంగ్రెసు తీర్మానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుజరిపితీరుతాం. ప్రణాళికకు అనుగుణంగా ఈ లక్ష్యసిద్ధికోసం సర్వశక్తులూ ధారపోస్తామని ప్రధాని నెహ్రూ నేడిక్కడ పునరుద్ఘాటించారు.

శ్రీ నెహ్రూ యిక్కడి కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పై విధంగా చెప్పారు.

సహకార వ్యవసాయానికి వ్యతిరేకంగా ఎంత విమర్శ వచ్చినా దాన్నంతటినీ ఆహ్వానిస్తాను. కాని మనం ఒక నిర్ణయం తీసుకున్నాం. ఇక యీ నిర్ణయానికి వెనుకచూపు లేదని ఆయన చెప్పారు.

విజయవాడలో 2000 మంది రిక్షా కార్మికుల ఊరేగింపు

ఆంధ్రసిమెంట్ కార్మికుల సమ్మెకు సానుభూతిగా

విజయవాడ, ఏప్రిల్ 13

ఆంధ్ర సిమెంటు కంపెనీ కార్మికుల సమ్మెకు సానుభూతిగా నిన్న సాయంత్రం విజయవాడలో 2,000 మంది రిక్షా కార్మికులు ఊరేగింపు జరిపారు.

సాయంత్రం సిటీ టెక్నికల్ కాలేజ వద్ద నాలుగువేలమందితో బహిరంగ సభ జరిగింది. రిక్షా వర్కర్సు యూనియన్ కార్యదర్శి శ్రీ బెల్లపు శ్రీరాములుగారు సభకు అధ్యక్షత వహించారు.

రిక్షా వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు శ్రీ చలసాని వెంకటరత్నంగారు మాట్లాడుతూ తొలగింపబడిన సిమెంటు కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరారు. రిక్షాల సంఖ్యను తగ్గించరాదని, విజయవాడలో 8,000 మందికి లైసెన్సులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విజయవాడ మునిసిపల్ వైస్‌చైర్మన్ శ్రీ టి. వెంకటేశ్వరరావుగారు సిమెంటు కార్మికుల సమ్మెను బలపరుస్తూ యజమానుల చర్యలను ఖండిస్తూ మాట్లాడారు. సిమెంట్ కార్మికులకు రావలసిన మార్చినెల జీతాలు ఇవ్వకుండా, కార్మికులను నిరాహార దీక్షకు పురికొల్పడం చాలా అన్యాయమన్నారు.

సిమెంట్ కార్మికులసమ్మెను వెంటనే పరిష్కరించాలని, తొలగించబడిన 814 మందిని తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరుతూ సభలో తీర్మానించారు.

విజయవాడలో 8,000 మంది రిక్షా కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలని, రిక్షాల సంఖ్యను తగ్గించరాదని వేరొక తీర్మానం చేశారు.

ముఖ్యమంత్రివద్దకు సిమెంటు కార్మికుల రాయబారం

విజయవాడ, ఏప్రిల్ 13

ఆంధ్ర సిమెంటుకంపెనీ కార్మికులకూ, యజమానులకూ మధ్య వచ్చిన తగాదాను గురించి ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి నివేదించుకోవడానికి, నేడాయన విజయవాడ వచ్చిన సందర్భంలో రాయబారం వెళ్లారు. ఇరవై అయిదురోజుల నుండి సమ్మె సాగిస్తున్న సుమారు ఆరు వందల మంది సిమెంటు కంపెనీ కార్మికులు ఊరేగింపుగా ప్రభుత్వ అతిథి భవనంవద్దకు వెళ్ళారు. సిమెంటు కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ కె. వి. ఎ.ఎస్. రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. వి. సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి శ్రీ శేషగిరిరావు, ఉపాధ్యక్షులు శ్రీ బి. లూథర్‌గార్లు ముఖ్యమంత్రిని కలుసుకొని, పరిస్థితి నంతటినీ వివరించారు. సమస్యా పరిష్కారానికి పూనుకోవలసిందిగా ముఖ్యమంత్రిని కోరారు.

ముఖ్యమంత్రి అంతా సావధానంగా విని, కంపెనీ మేనేజమెంటుతో మాట్లాడి, పరిష్కార ప్రయత్నం చేస్తాననీ, అందుకు అవసరమగు చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టరు గారికి చెబుతానని అన్నారు.

గృహపరిశ్రమలకు సబ్సిడీలు

శ్రీ మొరార్జీ అభిప్రాయం

హైదరాబాద్, ఏప్రిల్ 13

ప్రభుత్వం గృహపరిశ్రమలకు నిరవధికంగా సబ్సిడీలను యివ్వలేదని కేంద్ర ఆహార మంత్రి శ్రీ మొరార్జి దేశాయి నేడిక్కడ నాల్గవఅఖిలభారత దంపుడుబియ్యం పనివారల మహాసభను ప్రారంభిస్తూ చెప్పారు. గృహపరిశ్రమలు ప్రభుత్వ కొనుగోలు పద్ధతిపై ఆధారపడ్డంతగదని కూడా ఆయన అన్నారు.

అఖిల భారత గ్రామీణ, ఖాదీ పరిశ్రమల సంఘం ఆధ్వర్యాన ఈ మహాసభ జరిగింది.

భారీ, గృహ పరిశ్రమల మధ్య సమన్వయం అవసరమన్నారు. దేశ సౌభాగ్యానికి భారీపరిశ్రమ లెంత అవసరమో అసంఖ్యాక ప్రజలకు ఉద్యోగావకాశాల్ని కల్పించడానికి గృహపరిశ్రమలు కూడా అంతే అవసరమని శ్రీ దేశాయ్ అన్నారు.

ఈ లఘుపరిశ్రమలకు [illegible] కూడా ప్రభుత్వ సహాయం లభిస్తుంటే చొరవ పోతుందన్నారు. ఈ పరిశ్రమలు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి, మార్కెట్లు సంపాదించి, స్వయం పోషకం కావాలన్నారు.

మూడు రోజులపాటు జరుగనున్న ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచీ దంపుడు బియ్యం పరిశ్రమాభివృద్ధికి తోడ్పడే 150 మంది పనివారలు హాజరవుతున్నారు. మహాసభకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలమంత్రి శ్రీ భగవంతరావు అధ్యక్షత వహించారు.

ఇతరత్రా ఆదాయం లభించే అవకాశాలులేని వ్యవసాయ కూలీలకు వడ్లు దంపకంవల్ల మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీ భగవంతరావుగారన్నారు. ఈవిషయంలో కార్వేకమిటీ సూచనలను అంగీకరించాల్సిన అవసరం వుందన్నారు. (వి. వి)

హైదరాబాద్‌కు కేరళ ఆహారమంత్రి

తిరువనంతపురం, ఏప్రిల్ 13

కేరళకు బియ్యం కొనుగోలు చేసే విషయమై ఆంధ్ర ప్రదేశ్ ఆహార మంత్రి, ఆంధ్ర బియ్యం మిల్లర్ల సంఘం వారితో చర్చించేందుకు కేరళ ఆహార మంత్రి శ్రీ కె. సి. జార్జి రేపు ఉదయం యిక్కడనుండి విమానంలో హైదరాబాద్ వెళ్తున్నారు.

శ్రీ జార్జి తిరిగి ఏప్రిల్ 17 న తిరువనంతపురం చేరుకుంటారు.

నేపాల్‌కు సోవియట్ సహాయం గురించిన ఒడంబడిక

ఖాట్మండు, ఏప్రిల్ 13

నేపాల్‌కు సోవియట్ మూడు, నాలుగు కోట్ల రూపాయల మేరకు సహాయం చేయడం గురించి ఉభయ ప్రభుత్వాలకూ ఒడంబడిక కుదిరింది. ఒడంబడికపై వచ్చేవారం ఖాట్మండులో ఇరుపక్షాలవారి సంతకాలుజరుగుతాయి. భారత, నేపాల్ దేశాలు రెండిటిలోనూ సోవియట్ రాయబారి అయిన పానమరెంకో ఇందుకోసం 22 న ఢిల్లీనుండి వస్తున్నారు.

అరబ్బు రిపబ్లిక్‌కి భారతదేశంమందుల బహూకరణ

కైరో, ఏప్రిల్ 13

భారత ప్రభుత్వం కైరోలోని తన రాయబారి శ్రీ ఆర్. కె. నెహ్రూ ద్వారా ఐక్య అరబ్ రిపబ్లిక్‌కు మందులు వైద్యపరికరాలు, ఆహార పదార్థాలు అనేకం బహూకరించింది.

శ్రీ నార్ల వెంకటేశ్వర రావు స్వర్ణోత్సవం

విజయవాడ, ఏప్రిల్ 13

ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారి స్వర్ణోత్సవం నేడిక్కడ కేంద్రమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగింది.

శ్రీ వెంకటేశ్వరరావుగారికి 50 ఏళ్ళునిండిన సందర్భాన్ని పురస్కరించుకొని వారి అభిమానులూ, మిత్రులూ ఈ స్వర్ణోత్సవం ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంలో శ్రీ దుర్గాకళా మందిరంలో జరిగిన సభలో మద్రాసు ప్రధానన్యాయమూర్తి శ్రీ రాజమన్నారు గారు, ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, అఖిలభారతకాంగ్రెసు కార్యదర్శి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు, ప్రసిద్ధ సినిమా నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, శ్రీ తాపీ ధర్మారావు, శ్రీ కోటంరాజు రామారావుగార్లు ప్రసంగించారు.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారికి శుభాకాంక్షలు తెల్పుతూ ఉపరాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి శ్రీ గోవింద వల్లభ పంత్, ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ భీమసేన సచార్, కేరళ గవర్నరు శ్రీ బూర్గుల రామకృష్ణారావు మొదలగువారు సందేశాలు పంపించారు.

శ్రీ రాజమన్నారు సభను ప్రారంభిస్తూ శ్రీ నార్ల వెంకటేశ్వరరావు పత్రికా సంపాదకుడుగా, నాటకకర్తగా, కవిగా ఆంధ్రదేశంలో ప్రసిద్ధికెక్కారని, "వాస్తవమ్ము నార్లవారిమాట" అనే మకుటంగల పద్యాలు చిరస్థాయిగా వుంటాయని అన్నారు.

సభాధ్యక్షులు శ్రీ బెజవాడగోపాలరెడ్డి ప్రసంగిస్తూ 30 సంవత్సరాలక్రితం సుప్రసిద్ధ సంపాదకులు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు, ముట్నూరి వెంకట కృష్ణారావుగార్లకు సన్మానం జరిగిన దుర్గాకళామందిరంలోనే, నేటి పత్రికా సంపాదకులలో ప్రముఖులైన శ్రీ నార్ల వెంకటేశ్వరరావుకి సన్మానం జరగడం ఎంతో సముచిత మని అన్నారు.

శ్రీ నీలం సంజీవరెడ్డి మాట్లాడుతూ రాజధాని సమస్యపై, తన్ను శ్రీ నార్ల సంపాదకీయ వ్యాసాలద్వారా, వ్యంగ్య చిత్రాల ద్వారా తీవ్రంగా విమర్శించినప్పటికీ, వ్యక్తిగతమయిన విమర్శలకు దిగలేదని కొనియాడారు.

శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారు ప్రసంగిస్తూ, "ఆంధ్ర దేశాన్ని నియంతృత్వ శక్తుల బారి నుండి శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు రక్షించి ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేసినందుకు ఆంధ్ర ప్రజలు వారికి కృతజ్ఞులై వుంటారని" అన్నారు,

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు నార్ల గారి గుణగణాలను ఉగ్గడించారు.

శ్రీ తాపీ ధర్మారావు, శ్రీ వెంకటేశ్వరరావు నూరేళ్లు జీవించి ఇంకా వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు.

వాణిజ్యమండలి మొదలగు సంస్థలు సన్మానపత్రాలను సమర్పించాయి. పలువురు కవులు ప్రశంసాపద్యాలు చదివారు.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఉచిత రీతిని సమాధానమిస్తూ, చిన్నతనం నుండి తన్ను పెంచిపెద్దజేసిన తల్లినీ, ఇతర పెద్దలనూ, తన యజమానియైన శ్రీ గోయెంకాను స్మరించి నమస్కరిస్తున్నానని అన్నారు. తాను ఆంధ్ర దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించానని కొందరు వక్తలు పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఇట్లాఅన్నారు:

"ప్రజాస్వామ్యానికి నేడేర్పడినంత ప్రమాదం మునుపెన్నడూ లేదు. నెహ్రూవంటి మహాపురుషుల నాయకత్వం ఇంకా పదేళ్ళు కొనసాగితేగాని దేశంలో ప్రజాస్వామ్యంసుస్థిరం కాదు. మద్రాసులో మతశక్తులు విజృంభించాయి. అదేవిధంగా దేశంలో ఇతరత్రా నియంతృత్వ శక్తులు కూడా విజృంభిస్తున్నాయి. వీటి బారినుండి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవలసిన అవసరం ఎంతో వుంది."

బియ్యం, పిండిమిల్లుకార్మికుల కనీస జీతాల పునః పరిశీలక సంఘ పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 13

బియ్యం, పిండి మిల్లుల్లో పనిచేసే కార్మికుల కనీస వేతనాల సమస్యను పునః పరిశీలించే విషయమై ఆంధ్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ఆయా కార్మిక, యజమానుల సంఘాల నుండి సాక్ష్యసేకరణకు, సూచనలను పొందడానికి ఈ క్రింది తేదీలలో కొన్ని ప్రదేశాలను సందర్శించనున్నది:

ఏప్రిల్ 16 : కాకినాడ (ఫ్యాక్టరీ కార్యాలయ రీజనల్ ఇన్‌స్పెక్టరు) ఏప్రిల్ 17 : తాడేపల్లిగూడెం (ట్రావెలర్సు బంగళా), ఏప్రిల్ 18 : తాడేపల్లిగూడెంలో ముకాం, ఏప్రిల్ 19 విజయవాడ (ఫ్యాక్టరీ కార్యాలయ ఇన్‌స్పెక్టర్), ఏప్రిల్ 20 తెనాలి (ట్రావెలర్సు బంగాళా) (వి. వి)

మైనర్ పంచాయితీఎన్నికల్లో రహస్య బ్యాలెట్ అవసరం

కృష్ణాజిల్లా పంచాయితీ అధ్యక్షుల మహాసభ తీర్మానం

బందరు, ఏప్రిల్ 13

మైనర్ పంచాయితీ ఎన్నికలనుకూడా మేజర్ పంచాయితీ ఎన్నికలవలె రహస్యబ్యాలెట్ పద్ధతిపై జరపాలనీ, పంచాయితీ సభ్యులకు మూడింట రెండువంతుల మెజారిటీ ఓటుతో అధ్యక్షునిపై విశ్వాసరాహిత్య తీర్మానం చేయగల హక్కు ఉండాలనీ, బందరులో జరుగుతూన్న కృష్ణాజిల్లా పంచాయితీ అధ్యక్షుల సంఘ ద్వితీయ మహాసభలో నేడు తీర్మానించారు.

సంఘాధ్యక్షులయిన శ్రీ చెన్నుపాటి రామకోటయ్య గారు సభకధ్యక్షత వహించారు.

జిల్లాలో మొత్తం 847 పంచాయితీలుండగా, అయిదు వందల మంది మహాసభకు వచ్చారు. వీరిలో మహిళా సభ్యులు యాభై మంది ఉన్నారు.

ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ శ్రీ రంగారెడ్డి, జిల్లా పంచాయితీ ఆఫీసర్ శ్రీ జి. నారయ్యగార్లు కూడా సభకు వచ్చారు.

ఈ సభ సందర్భంలో పంచాయితీలు సాధించిన అభివృద్ధిని వివరిస్తూ ఒక ప్రదర్శనాన్ని కూడా ఏర్పాటు చేశారు. స్థానికసంస్థల ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ జి. సింహాద్రిగారు ఈ ప్రదర్శనాన్ని ప్రారంభించారు. వ్యవసాయోత్పత్తిని పెంచడం విషయంలో రైతులకు తోడ్పడే కార్యక్రమంపట్ల పంచాయితీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు తన ప్రసంగంలో తెలిపారు.

పంచాయితీల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పంచాయితీ కార్యదర్శులుగా మాత్రమే వ్యవహరించాలనికూడా నేటి సమావేశంలో ఒక తీర్మానం చేశారు (వి.వి.)

గెయిట్‌స్కెల్ రష్యా పర్యటన

వాల్ వెర్ హాంప్‌టన్, ఏప్రిల్ 13

బ్రిటిష్ లేబరుపార్టీ నాయకుడు హ్యూ గెయిట్‌స్కెల్ తాను ఈ సంవత్సరం ఆఖరులో బెవాన్‌తో కలసి సోవియట్ యూనియన్ సందర్శించనున్నానని పత్రికా విలేఖరులతో అన్నారు.

తాను ఎప్పుడు వెళ్ళేదీ జనరల్ ఎన్నికలు జరిగే తేదీనిబట్టి వుంటుందన్నారు. తన్ను, రష్యాకు రావలసిందిగా సోవియట్ యూనియన్ వారు ఆహ్వానించారు కాని తానింతవరకు వెళ్ళలేకపోయానని గెయిట్‌స్కెల్ అన్నారు.

"మేము ప్రతిపక్షంలో ఉన్నాము కాబట్టి సోవియట్ ప్రభుత్వంతో సంప్రదించేపని మాదికాదు. కాని వ్యక్తిగతంగా అక్కడివారిని కలుసుకొని పరిచయం చేసుకోవడం ఎంతో ఉపయోగకరం" అని గెయిట్‌స్కెల్ అన్నారు.

దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు

విధించటానికి ఆఫ్రికాలోని స్వతంత్ర దేశాలు ఆలోచిస్తున్నవని ఆఫ్రికన్ నాయకుని ప్రకటన

వాషింగ్టన్, ఏప్రిల్ 13

మాలపల్లిచట్టం అమలు జరుపుతున్నందుకు నిరసనగా, ఆఫ్రికాలోని స్వతంత్ర దేశాలన్నీ దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు విధించాలని ఆలోచిస్తున్నవని కెన్యా కార్మికనాయకుడు టాం యంబోయా నేడు పత్రికాగోష్ఠిలో వెల్లడించారు.

"ప్రపంచంలోని అన్ని స్వేచ్ఛా దేశాలు ఈ విషయంలో మాతో చేరవలసిందిగా మేము విజ్ఞప్తి చేయదలచాము" అని అన్నారు.

"స్వేచ్ఛా దేశాలంటే ఏవి?" అని ఒకరు అడుగగా యంబోయా ఇలా అన్నారు: "సోవియట్ యూనియన్ కూడా మాతో చేరదలచుకొంటే మేము వద్దనము"

యంబోయా కెన్యా కార్మిక సంఘ సమాఖ్య కార్యదర్శి; నైరోబి పీపుల్స్ కన్వెన్షన్ పార్టీ అధ్యక్షుడు. యంబోయా, ఇంకా ఇలా అన్నారు: దక్షిణ ఆఫ్రికాలోని పరిస్థితిని ఐరాససలో చర్చకు తేవడానికై ఆఫ్రికా లోని స్వతంత్ర రాజ్యాలు ప్రయత్నిస్తాయి. న్యాసాలాండులో బ్రిటిష్ జరిపిన అత్యాచారాలను అమెరికా ఖండించకపోవడం శోచనీయం.

ఆస్ట్రేలియా సోవియట్ దౌత్య సంబంధాలు

పునఃప్రారంభం

కాన్‌బెరా, ఏప్రిల్ 13

సోవియట్‌కూ ఆస్ట్రేలియాకూ మధ్య తిరిగి దౌత్యసంబంధాలు నెలకొల్పబడతాయి.

మాస్కోలో ఆస్ట్రేలియా ప్రభుత్వ దౌత్య కార్యాలయాన్ని స్థాపించడానికి ఆస్ట్రేలియా విదేశాంగ శాఖ ఉద్యోగి కాట్స్ త్వరలో మాస్కో వెడుతున్నాడు. ఆ తరువాత ఆస్ట్రేలియా ప్రభుత్వం రాయబారిని నియమిస్తుంది.

ఆస్ట్రేలియాకు సోవియట్‌కు మధ్య దౌత్య సంబంధాలు 54 లో తెగిపోయాయి. గూఢచారుల ద్వారా రహస్య సమాచారం సేకరించడానికై ఆస్ట్రేలియాలోని తన దౌత్యకార్యాలయాన్ని రష్యా వినియోగిస్తున్నదని, రష్యా దౌత్య కార్యాలయోద్యోగి పెట్రోవ్ 54లో ఒక ఆరోపణచేశాడు. తత్ఫలితంగా ఉభయ ప్రభుత్వాలు తమ తమ రాయబారాలను ఉపసంహరించుకొన్నాయి.

హైదరాబాద్ విశేషాలు

సీతాఫలమండి విద్యాసంఘం

సీతాఫలమండి విద్యాసంఘం 12 వ తేదీన శ్రీ గురుమూర్తి అధ్యక్షతను సమావేశమైంది. జమాఖర్చులు, సాంవత్సరిక నివేదిక చర్చించి ఆమోదించిన తరువాత శ్రీ గురుమూర్తిని అధ్యక్షులుగా, శ్రీ జి. వెంకటేశ్వరరావుగారిని కార్యదర్శిగా, శ్రీ డి. వి. జోసెఫ్‌ని కోశాధికారిగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ బెలూన్లతో శాస్త్రీయ పరిశోధన

ఏప్రిల్ 15, మే 15 లోపల హైదరాబాద్ నుండి టాటా ఇన్‌స్టిట్యూట్ శాస్త్రజ్ఞులు ఎనభై నుండి నూట ఇరవై అడుగుల వ్యాసం గల ప్లాస్టిక్ బెలూన్లకు కాస్మిక్ కిరణాల పరిశోధన పరికరాలను కట్టి పైకిపంపించనున్నారు. అణుశక్తి కమిషన్ వారు ఈ ప్రయోగాలకు వలసిన ధనాన్ని యిస్తున్నారు. ఈ బెలూన్లు అంతరిక్షంలోకి పయనిస్తాయి. బెలూన్లనుండి యంత్ర పరికరాలు విడివడి పారచూట్లద్వారా క్రిందికి దిగివస్తాయి. ఈ పారచూట్లు హైదరాబాద్ నగర శివారుల్లో దిగవచ్చుననీ, వీటిని చూసినవారు తమకు తెలియజేస్తే బహుమానాలు యిస్తామని ఈ శాస్త్రజ్ఞులు తెలియజేస్తున్నారు. వీరు ఉస్మానియా యూనివర్సిటీలో మకాం వుంటారు.

* * *

అఖిలభారత సోషలిస్టుపార్టీ తృతీయ మహాసభ కాశీలో ఏప్రిల్ 25 నుండి 28 వరకూ జరుగుతుంది.

సిమెంటు పరిశ్రమకు సాంకేతిక త్రైపాక్షిక కమిటీ నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 14

సిమెంటు పరిశ్రమకు కేంద్ర సాంకేతిక త్రైపాక్షిక కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది.

ఈ కమిటీ సమావేశం రాంచీలో ఈ నెల 20 వ తేదీనుండి జరుగుతుంది. ఆ తరువాత బీహారులో సిమెంటు ఫ్యాక్టరీలున్న చాయిబాసా, ఖలారి తదితరచోట్ల పర్యటిస్తుంది.

కార్మికుల పని పరిస్థితులు, జీతభత్తేలు, ఇతర సౌకర్యాల గురించి యీ కమిటీ చర్చిస్తుంది. ఇందులో ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డి సభ్యులుగా ఉన్నారు. (వి. వి.)

ప్రధాని రాకవలన పట్టణాల్లో ట్రాఫిక్ బంద్ చేయరాదు

— శ్రీ నెహ్రూ

హరిద్వారం, ఏప్రిల్ 30

తాను వున్న కారణంగా పట్టణంలోని ఏ భాగంలోనూ ట్రాఫిక్‌ను బంద్ చేయరాదని ప్రధాని నెహ్రూ నేడిక్కడ పోలీసు అధికారులకు తెలియజేశారు.

పట్టణంలోని కేంద్రస్థానంగా గీతాభవనంలో కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ పట్టణంలో ట్రాఫిక్ అంతా బంద్ చేశారనీ, తనవలన అలా జరగరాదనీ అన్నారు.

* * *

కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి మైసూరులోని నావల్‌గుడ్‌లో ఒక కొత్త ఆస్పత్రిని ప్రారంభించారు.

సోషలిస్టు పార్టీ మహాసభ వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 13

ఆంధ్రప్రదేశ్ సోషలిస్టుపార్టీ మహాసభ (రాజా వర్గంవారు) ఈనెల 15, 16 తేదీలలో జరుగుతుందని లోగడ ప్రకటించారు. తెలంగాణాలో పంచాయితీ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఈ సభను మే నెలకు వాయిదా వేశారు.

* * *

మతం పేరుతో సోమరులుగా కూర్చునేవారు మతానికి అప్రతిష్ట తెచ్చేవారని హరిద్వారంలో ప్రధాని నెహ్రూ అన్నారు.

SINDOL
సిండాల్
తలనొప్పి
నొప్పులు
జ్వరము
జలుబు
మొదలగువాటిని
అతి త్వరితముగా పోగొట్టును.
సిండాల్ పౌడరు, సిండాల్ బిళ్ళలు
పైపూతకు:
సిండాల్ పెయిన్ బామ్
ASEPTICUS COMPANY
G. P. O. 560, BOMBAY-1 (V)

మోహన్‌లాల్ & సన్సు
(ఫార్మస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్సు)
★
1959 ఏప్రిల్ 15 వ తేదీ బుధవారం
ఉదయం 10-30 & 12 గంటలమధ్య
నెం. 9-5-615, భావనారాయణవీధి,
విజయవాడ - 1
యందు నూతనముగా మేము ప్రారంభింపబోవు
ఆఫీసు
ప్రారంభోత్సవమునకు తాము తప్పక విచ్చేయ గోరుచున్నాము.
తంతి "SADRIWALA"   ఫోన్ P. P. 528

[illegible] (అధ్యక్షులు), [illegible] విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోసం ఎలెక్ట్రిక్ ప్రింటింగ్ [illegible]